సత్యం శివం సుందరం
శ్రీ సరస్వతీ విద్యాపీఠము

# స్ఫూర్తి

విద్యావిషయక మాస పత్రిక

సంపుటి : 50 సంచిక : 08 వెల : రూ. 18/- పుటలు : 36

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఆషాఢ - శ్రావణ మాసములు ఆగష్టు : 2026



నీవు నాకు రక్ష, నేను నీకు రక్ష
మనం దేశానికి రక్ష ...






**శ్రీ సరస్వతి శిశు మందిర్‌కు స్వర్ణం!**

గోవాలో జరిగిన 9వ ఆసియా కప్ ఓపెన్  ఇంటర్నేషనల్ టేక్వాండో ఛాంపియన్‌షిప్ 2026లో మా విద్యార్థి,
రేకుల తేజ ప్రవర్ధన్, స్వర్ణ పతకం గెలుచుకున్నాడని ప్రకటించడానికి మేము ఎంతో  గర్విస్తున్నాము!
కఠోర శ్రమ, అంకితభావం నేరుగా  శిఖరాగ్రానికి దారితీస్తాయని నిరూపిస్తూ,  జూనియర్ పురుషుల అండర్
48 కేజీల  విభాగంలో చి.తేజ ఆధిపత్యం చెలాయించాడు. అంతర్జాతీయ వేదికపై పాఠశాలకు,
సమాజానికి అపారమైన కీర్తిని తెచ్చిపెట్టిన తేజకు, కుటుంబానికి, మరియు
కోచ్‌లకు ప్రధానాచార్యులు అభినందనలు  తెలియజేశారు.



శ్రీ సరస్వతీ శిశు మందిర్ కరినగర్‌లో  రాష్ట్రీయ స్వయం సేవక్  సంఘ్ జన్మ శతాబ్ది సందర్భంగా
నరేంద్ర-వివేక, కేశవ-మాధవ ప్రతిభా పురస్కారాలను విద్యార్థులకు అందజేశారు.  1వ  నుంచి 10వ తరగతి వరకు
ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు  పూర్వ విద్యార్థి  కొమ్మెర చంద్రశేఖర్ రెడ్డి  నగదు బహుమతులు,
మెరిట్ సర్టిఫికెట్లు  ప్రదానం చేశారు.  ముఖ్య అతిథిగా సి.ఏ. నిరంజనా చారి  పాల్గొని అల్లూరి సీతారామరాజు
గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇంజనీర్ కోల  అన్నారెడ్డి,  కొమ్మెర ప్రవీణ్ కుమార్
రెడ్డి, కోల రామచంద్రా రెడ్డి,  కౌలుగూరి  సదాశివ రెడ్డి, దేవరకొండ లక్ష్మణ్ మూర్తి, గుగ్గిళ్ళ రమేష్,
శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు. పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ కూడ ఉన్నారు.

# స్ఫూర్తి

## విద్యావిషయక మాస పత్రిక

కలియుగాబ్ది-5128, శాలివాహన శక సం. 1948, శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ-శ్రావణ మాసములు

సంపుటి : 50, సంచిక : 08, ఆగష్టు 2026 , పుటలు : 36, వెల : రూ.18/-

సంపాదకులు
**డా॥ అన్నదానం వేం. సుబ్రహ్మణ్యం**
ప్రచురణ కర్త
**పసర్తి మల్లయ్య**
**సంపాదకమండలి**
రావుల సూర్యనారాయణ
రమా విశ్వనాథన్
గోపగోని సప్తగిరి
అన్నావఝ్జుల శ్రీనాథ్
పతకమూరి శ్రీనివాసరావు
శ్రీమతి అనఘా వెంకటలక్ష్మి
**ముద్రణ**
సాయి లిఖిత ప్రింటర్స్, ఖైరతాబాద్,
హైదరాబాద్-500004
**డి.టి.పి.**
**స్ఫూర్తి గ్రాఫిక్స్**
శ్రీ సరస్వతీ విద్యాపీఠము,
ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004

**స్ఫూర్తి చందా వివరములు**

**స్ఫూర్తి వార్షిక చందా రూ॥ 220-00 లు**
యం.ఓ./ డి.డి. ద్వారా
శ్రీ సరస్వతీ విద్యాపీఠము పేరున
క్రింది చిరునామాకు పంపగలరు.

**శ్రీ సరస్వతీ విద్యాపీఠము**
ఇ.నెం. 6-3-597/ఎ/7,
వేంకటరమణ కాలనీ,
ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.
**ఫోన్ : 040-23316160, 23316084**
**e - mail :sphoortissvp@gmail.com**

## అమృతవాణి

శ్లో॥ విద్యా వృద్ధేషు సుశ్రద్ధా తపో వృద్ధేషు పూజ్యతా ।
వయో వృద్ధేషు నమ్రత్వం స్వీకార్యం సంఘ యోగినా ॥

**భావము :** మనుషులు విద్యా వృద్ధులు అనగా విద్వాంసుల యెడల శ్రద్ధ, తపో వృద్ధుల యెడల పూజ్యతా భావన, వయో వృద్ధుల యెడల వినయం కలిగి ఉండాలని వినయ గుణాన్ని స్వీకరించాలని సంఘ గీతలో

## ఈ సంచికలో . . .

| | |
|---|---|
| సంపాదకీయము | ... 04 |
| దేశ రక్షాబంధనం | ... 05 |
| ఘన విజయం ..కల్పక్కం | ... 09 |
| వకలక్ష్మి వ్రతం - సామాజిక స్పృహ | ... 11 |
| రక్తి-శక్తి-భక్తి-ముక్తి !! | ... 13 |
| దేశ గౌరవం కోసం ఆట ఆడండి. | ... 15 |
| చిత్రమాలిక | ... 17 |
| శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు | ... 21 |
| లోకజ్ఞానం - 213 | ... 22 |
| పిల్లలకు మన ధర్మ గ్రంథాలు అవసరమా ! | ... 23 |
| నిశ్శబ్ద ఒత్తిడి | ... 25 |
| సామాజిక, తాత్వికత కలబోతే "యోగి అరవిందులు" | ... 29 |
| వార్తలు | ... 33 |

Printed & Published by **Pasarti Mallaiah** on behalf of Sri Saraswathi Vidya Peetham (Owner) and Printed at **Sai Likhita Printers**, # 6-2-959, D.B.Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd - 500004 and Published at Sri Saraswathi VidhyaPeetham, # 6-3-597/A/7, Venkataramana Colony, Khairatabad, Hyd - 500004 (Publication Place) Editor : **Dr. Annadanam Venkata Subrahmanyam.**



# అయోధ్య హుండీ ఉదంతం దురదృష్టకరం

కొన్ని యుగాల చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రం అయోధ్య. తరతరాల నుండి జరుగుతున్న పోరాటాలు, బలిదానాలు, త్యాగాలు, రక్త తర్పణాలు, కోట్లాది హిందువుల భక్తి శ్రద్ధల ఫలితంగా పునర్నిర్మితమైన రామమందిరం హిందూ సమాజానికి శక్తి కేంద్రమే కాదు జాతీయ స్వాభిమాన చిహ్నం. భక్తి, ధార్మిక కేంద్రం కూడ. అటువంటి దేవాలయం లోని హుండీలో భక్తి, విశ్వాసాలతో భక్తులు సమర్పించిన విరాళాలు దొంగతనానికి గురికావడం రామ భక్తుల మనోభావాలను దెబ్బతీసింది. విశ్వాసాన్ని గాయ పరచింది. ఎంతో వేదనను కలిగించింది. మరో వైపు ఎంతో ఆగ్రహాన్ని కూడ కలిగించింది. శ్రద్ధా కేంద్రాలు ఆదర్శాన్ని ఆవిష్కరిస్తుండాలి. జరిగిన సంఘటన దురదృష్టకరమైనది. అది కొందరు వ్యక్తులు స్వార్థంతో చేసిన తప్పిదం. అయినా తప్పు తప్పే. సరిదిద్ద వలసిందే. దోషులు శిక్షింపబడవలసిందే.

ఈ తప్పిదాన్ని ప్రారంభ దశలోనే గుర్తించడం ఒక విధంగా మంచి జరిగింది. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు విజ్ఞప్తి మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయడం, దర్యాప్తు వేగంగా కొనసాగుతుండడం ఇప్పటికే కొందరు దోషులను గుర్తించి అరెస్టు చేయడం విచారణ చేస్తుండటం స్వాగతించదగిన అంశం. అలాగే తప్పిదాన్ని గుర్తించిన వెంటనే ట్రస్టు చైర్మన్, కార్యదర్శులు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా సమర్పించి నిష్పక్ష విచారణకు తెరదీయడం అభినందించదగిన విషయం.

దర్యాప్తు బృందం (సిట్) చేయబోయే సిఫార్సుల కనుగుణంగా దోషులు కఠినంగా శిక్షించబడాలి. అప్పుడే శ్రద్ధా కేంద్రాలలో ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా ఉంటాయి. వ్యక్తులు చేసిన దోషాలే కాని వ్యవస్థ లోపం కాదని సమాజం తెలుసుకోవాలి. జరిగిన యీ దురదృష్టకర సంఘటనాధారంగా చేసుకొని హిందూ ధర్మాన్ని అప్రతిష్ఠపాలు జేస్తూ సమాజంలో చీలికలు తీసుకు వచ్చే హిందూ వ్యతిరేక శక్తులు చేసే ప్రయత్నాల పట్ల సమాజం అప్రమత్తంగా ఉండాలి. తగిన సంయమనాన్ని & సహనాన్ని కలిగి ఉండాలి. అలాగే శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకూడ ఈ ఘటననుండి గుణపాఠం నేర్చుకొని ఇక మీదట ఆలయ నిర్వహణలోను, ఆగమశాస్త్ర కార్యక్రమాలలోను, ముఖ్యంగా నిధి విషయంలోను తగిన జాగ్రత్త వహించాలి. లోపాలు సరిదిద్దాలి. సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి. రామభక్తుల మరియు సంపూర్ణ హిందూ సమాజము యొక్క శ్రద్ధా విశ్వాసాలు బలహీనం కాకుండా మరింత దృఢతరమయ్యే విధంగా ట్రస్టు చర్యలు చేపడుతుందని ఆశిద్దాం! దోషుల పట్ల కఠినంగా వ్యవహరించాలని కూడ హిందూ సమాజం ఆకాంక్షిస్తోంది.

## ప్రభుత్వాలు యువత ముందు ఆదర్శాన్నుంచాలి

ఇటీవల జమ్మూకాశ్మీరు ప్రభుత్వం "పర్సనాలిటీస్ అండ్ లెజండ్స్ ఆఫ్ జమ్మూ & కాశ్మీర్" అనే పుస్తకాన్ని ప్రచురించింది. ఈ పుస్తకంలో ఆ రాష్ట్రంలోని, చారిత్రక, పౌరాణిక, సాంఘికంగా ఆదర్శవంతులైన వ్యక్తుల జీవన చరిత్రలను సంక్షిప్తంగా రాసింది. అది రాబోయే తరాలకు ఆదర్శప్రాయమౌతుంది. వారి అడుగు జాడలలో నడిచే ప్రయత్నం కొందరైనా చేస్తారు. అయితే ఆ పుస్తకంలో జమ్మూ & కాశ్మీర్ వేర్పాటువాద నాయకుడు మక్బూల్ భట్‌ను తదితరులను "షహీద్"గ అమరవీరుడుగా ఒక లెజండ్ గా చిత్రీకరించడం వివాదానికి తెరలేపింది. మక్బూల్ భట్ జె.కె.యల్.ఎఫ్. సంస్థాపకులలో ఒకరు. వేర్పాటువాద రాజకీయాలలో ప్రముఖ పాత్ర పోషించారు. అమరచంద్ హత్య కేసులో ఆయనకు 1984లో కోర్టు మరణ శిక్ష వేసింది. భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా హింసాత్మక మార్గాన్ని యెంచుకున్న వారిని షహీద్‌లుగ, లెజండ్స్‌గ చిత్రీకరిస్తే యువతకు తప్పుడు సందేశమందే ప్రమాదముంది. ప్రభుత్వాలు గుర్తించి మంచి బాటలు వేయాలి గాని తప్పుడు మార్గం చూపించగూడదు. ★

ముఖ చిత్రకథనం

# దేశ రక్షాబంధనం



- డా|| అన్నదానం వేం. సుబ్రహ్మణ్యం

**భా**రతీయ జీవన విధానాన్ని పరిపుష్టం చేయడానికి పర్వదినాలు, వ్రతాలు వంటివి ప్రముఖ పాత్ర పోషిస్తాయి. లోపాలను సరిదిద్దుకోవడానికే దోషాలను తొలగించు కోవటానికి కూడ ఇవి ఉపయోగపడతాయి. సామాజిక పరిస్థితుల ప్రభావం కారణంగా యీ వేడుకలలో కొన్ని మార్పులు, చేర్పులు, కూర్పులు కూడ చోటు చేసుకుంటాయి. చేటు కలిగించనంత వరకు అది మందిదే. మేలు కలిగిస్తాయనుకుంటే వాటికి స్వాగతం పలకాలి. అలా నూతనత్వాన్ని సంతరించుకుంటూ ప్రజా బాహుళ్యంలో అత్యంత ప్రాచుర్యాన్ని పొందుతున్న పర్వదినమే రక్షా బంధనం.

ఇది చారిత్రక కాలంలో జనజీవితంలో ప్రవేశించిన పండుగని భావించేవారు కొందరైతే, అలగ్జాండర్, రుక్సానా, పురుషోత్తములతో ముడిపెట్టి కట్టు కథ చెప్పేవారు మరికొందరు. ఏమైనా అదొక మంచి సందేశమే. అయితే ఈ రక్షాబంధన పర్వదినం యీ కాలం కంటే యెంతో ముందు నుండే అన్నట్లు హేమాద్రి పండితుడు చెప్పిన పర్వదినాలలోనే ఉంది. అయితే దానిని జరుపుకునే తీరు తెన్నులు మరోలా ఉండేవి. భవిష్యోత్తర పురాణం లో యీ రక్షాబంధన పర్వదిన ప్రస్తావన ఉంది. పౌరాణిక యుగంలో ఇది జంధ్యాల పూర్ణిమగా, దీక్షా ధారణ ఉత్సవంగా ప్రసిద్ధి పొందింది.

మంత్రులలో గాయత్రి మంత్రాన్ని మించినది లేదని లోక ప్రసిద్ధి. న గాయత్ర్యా: పరం మంత్రం అని గదా! ఇది సార్వజనిక మంత్రం. విశ్వజనీన మంత్రం. కారణం ఇది బుద్ధిని ప్రేరేపించేది. వికసింపజేసేది. గాయత్రి దేవి ప్రీత్యర్థం సామూహికంగాను, వ్యక్తి గతంగాను జప, హోమ, ధ్యానాదులు చేయడం ఉత్తమ ఫలితాలను పొందడం సంప్రదాయంగా వస్తున్నది. దానికనుగుణంగా సామూహికంగా యజ్ఞాలు కూడ చేస్తుండటం కూడ కద్దు. శుభకార్యాలు మరియు పుణ్య కార్యాల ప్రారంభ సమయాలలోను వాటిని నిర్విఘ్నంగా పూర్తి చేయాలనే సంకల్పంతో కంకణ ధారణ చేయడం కూడ పరిపాటి. అలా చేసే కంకణ ధారణే దీక్షాకంకణం.

కాలక్రమంలో అదే నేడు మనం జరుపుకుంటున్న రక్షాబంధనం. అదే దీనికి మూలసూత్రం. అయితే ఆ సమయంలో దీక్షాబంధనం చేసుకుంటూ గూడ యజ్ఞోపవీత ధారణ కలిగి ఉన్నవారు నూతన యజ్ఞోపవీత ధారణ చేస్తుండే వారు. కాబట్టి దీనికి జంధ్యాల పూర్ణిమ అని పేరు వచ్చింది. దీనికొక నేపథ్యం ఉంది.

ఆషాఢ శుద్ధ ఏకాదశి నుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు చాతుర్మాస్య దీక్షాకాలం అంటారు. ఈ సమయంలో మన పీఠాధి పతులు, సాధు సన్యాసులు తమతమ ఆశ్రమాలలోనే ఉంటూ అధ్యయన, అధ్యాపనలతో పాటు యజ్ఞయాగాది క్రతువులు, ధార్మిక ప్రవచనాలు జరుపుతూ ధర్మాన్ని పరిపుష్టం చేయాలనే నియమనిబంధనలున్నాయి. అలాగే ఆ తరువాత వచ్చే ఆషాఢ పూర్ణిమను వ్యాస పూర్ణిమ లేదా గురుపూర్ణిమగా పిలుస్తారు. శ్రావణ పూర్ణిమనాడు సహజంగానే విద్యార్జన చేసే విద్యార్థులు నూతన యజ్ఞోపవీతాలు ధరిస్తారు. అదే వారికొక దీక్షాధారణ . ఇంకొందరు దీక్షా కంకణాలు ధరించి, వేదాధ్యయనం కోసం గురుకులాలకు తరలి వెళ్ళేవారు. నియమనిష్ఠలతో అధ్యయనం చేస్తుంటారు. ఇందులో యెటువంటి తరతమ భేదాలుండేవి కావు. విద్య పూర్తయ్యే వరకు ఆ దీక్ష అలా కొనసాగుతుండేది. అదే దీక్షా బంధనం. అదే వారికి రక్షాబంధనంగా ఉండేది. శ్రావణ పూర్ణిమ నాడే జ్ఞాననంద స్వరూపుడైన హయగ్రీవుడు కూడ ఆవిర్భవించాడు. ఆయన సర్వవిద్యలకు ఆధారభూతుడు.

ఆయన విష్ణుమూర్తి అవతారరూపుడు.

వ్యక్తిగత అధ్యయన వికాసాలకు, సత్కార్యాచరణలకు ధరించే యీ దీక్షా కంకణం తరువాతి కాలంలో సామాజిక పరమైంది. సమాజ రక్షణ బాధ్యత కలిగిన వ్యక్తులు ఆ కార్యానికి కటిబద్ధులై దీక్షాధారులై సంకల్పం తీసుకునే వారు. శ్రీకృష్ణుడు ధర్మరాజుకు రక్షాబంధన ప్రాముఖ్యతను తెలియజేస్తూ దేవలోక సంరక్షణార్థం దేవేంద్రుని ప్రేరేపిస్తూ శచీదేవి ఇంద్రునికి రక్ష కట్టిన ఘట్టాన్ని ప్రస్తావించాడు. రాక్షసులు స్వర్గలోకంపై దాడి చేస్తే దేవతలు చెట్టుకొక్కరు పుట్టకొకరుగ చెల్లాచెదరు కాగా తన ప్రాణ సంరక్షణార్థం దాగియున్న ఇంద్రుని వద్దకు శచీదేవి వెళ్ళి

**యేన బద్ధో బలీరాజా దానవేంద్రో మహాబల: ।**

**తేన త్వాం అభి బధ్నామి రక్షమాచల మాచల ॥** అనగా "మహా బలుడైన దానవ రాజు రాక్షసుల కొరకు ఎలా కటిబద్ధుడై ఉన్నాడో అలాగే దేవతలను సంరక్షించుటకొరకు నీవు బద్ధుడవై యుండుటకు ఈ రక్షా సూత్రమును నీకు బంధించుచున్నాను. మమ్ములను రక్షించుటలో నీవు అచలుడుగా అనగా దృఢంగా ఉండవలసింది". అని రక్షాబంధనం చేసి ప్రేరణ కలిగించింది. ఇంద్రుడు ఆ ప్రేరణతోనే యుద్ధం చేసి విజయుడై దేవతలను రక్షించాడు. కాలగమనంలో రక్షణ కోరుకుంటూ దీక్షాధారణ చేసే సంప్రదాయం చోటు చేసుకొంది. అదే రక్షాబంధన మైంది. దాడులనుండి, దురాగతాల నుండి యెవరెవరికైనా రక్ష కట్టి రక్షణను కోరుకోవడం జీవనశైలిగా మారింది.

కాలక్రమంలో భారతదేశంపై విదేశీయుల, విధర్మీయుల దాడులు, దురాక్రమణలు అధికమయ్యాయి. హిందూ శ్రద్ధా కేంద్రాలకు రక్షణ లేకుండా పోయింది. స్త్రీ మరియు దేశ, ధర్మ వేదాలకు రక్షణ కరువైంది. అలాంటి ప్రమాదకర స్థితిలో స్త్రీలు రక్షా సూత్రంతో పురుషుల వద్దకు వెళ్ళి అన్నా నాకు రక్షణ కల్పించమంటూ రక్ష కట్టేవారు. అలా రక్షాబంధనం గావించుకున్నవారు ఆత్మీయ భావనతో వాళ్ళ రక్షణా బాధ్యతను స్వీకరించేవారు. ఈ పవిత్ర కార్యము ఇంటి నుండే ప్రారంభమైంది. ఇంట్లో ఉన్న సోదరుడికి రక్ష కట్టేవారు. అలా అన్నా చెల్లెళ్ళ పండుగగా పేరు పడ్డది. ఆత్మీయతను, అనురాగాన్ని ఆ రక్షలో కూర్చడంతో అనురాగానికి ప్రతీకగా అది రూపొంది అన్నా చెల్లెళ్ల పండుగగా ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా రాజపుత్రుల కాలంలో ఇది సామాజిక పర్వదినంగా ప్రత్యేకతను సంతరించుకొంది.

అలా అన్నా చెల్లెళ్ల పండుగగా నేడు రూఢి కెక్కిన యీ పండుగ నేటి సామాజిక పరిస్థితుల్లో మరికొంత విశాల దృక్పథంతో ముందుకు వెళ్ళవలసిన ఆవశ్యకత యెంతో ఉంది. నేడు మానవ జీవన విధానం భౌతిక దృక్పథంతో ఉంటోంది. విలువల కంటె సౌకర్యాలకు, సౌఖ్యాలకు ప్రాధాన్యమిచ్చేస్తున్నారు. ఆడదానికి ఆడదే శత్రువు అనే లోకోక్తి మనం విన్నాం. అందునా యీ పోటీ ప్రపంచంలో అసూయా ద్వేషాలు కూడ చోటు చేసుకోవడానికి అవకాశముంది. ఇలాంటి జాడ్యం నుండి సమాజాన్ని రక్షించుకోవాలంటే మహిళల్లో పరస్పరము స్నేహ సంబంధాలు, ఆత్మీయతానురాగాలు పెంపొందాలి. అందుకే ఇంట్లో అక్కా చెల్లెళ్ళు కూడ ఆస్తి పంపకాలు వచ్చినప్పుడు శత్రువులుగా మారకుండా సోదరీభావన పెంపొందడంకోసం ఆత్మీయంగా ఉండాలి. అందుకే మహిళలు పరస్పరము రక్షలు కట్టుకోవాలి.

నేడు అన్నా చెల్లెళ్ళ పండుగను విద్యాలయాల్లో, కార్యాలయాల్లో కూడా సామాజిక కార్యక్రమంగా నిర్వహించవలసిన అవసరమెంతో ఉంది. నేడు సమాజంలో లైంగిక వేధింపులు, అత్యాచారాలు, మైనర్ బాలికలపై వేధింపులు ఎక్కువవుతున్నాయి. మాతృ వత్పర దారేషు అనే జీవనశైలి గలిగిన యీ సమాజంలో స్త్రీల పట్ల దృష్టికోణం మారిపోతోంది. స్త్రీని ఒక భోగ వస్తువుగా ఆలోచించే పాశ్చాత్య దోరణి పెరుగుతోంది. పిన్నమ్మ, పెద్దమ్మ, వదినమ్మ, అక్క, చెల్లి అని చుట్టు పక్కల వాళ్ళు పరస్పరము ఆత్మీయంగా పిలుచుకునే పలకరింపులు కనుమరుగై పోయాయి. ఈ కారణంగా బాలికలపై, మహిళలు అన్యాయాలకు గురవుతున్నారు. ఈ ప్రమాదం

తొలగిపోవాలంటే సమాజపుటాలోచనా విధానం లో మార్పు రావాలి. రక్షా బంధనం సోదర సోదరీ భావాన్ని పెంపొందిస్తుంది. దానితో పాటు రక్షణను కలిగించే భావనను, బాధ్యతను కూడ పెంచుతుంది. నేడు మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్ళకు ఇదొక మార్గంగా కూడ భావించవచ్చునేమో ఆలోచించాలి.

అదే విధంగా నేడు రక్తం పంచుకొని పుట్టిన అన్నదమ్ముల మధ్య కూడ ఆస్తి పంపకాల సమయంలో అభిప్రాయ భేదాలు వస్తున్నాయి. పరస్పరము విభేదాలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. ఆస్తుల మాట అటుంచినా అవి లేని వారిలో కూడ యాంత్రిక, సాంకేతిక యుగం కారణంగానో మరే భావనతోనే బంధుభావనలు బలహీన మవుతున్నాయి. మళ్ళీ ఆ భావనలను పెంపొందించు కోవాలంటే అన్నదమ్ములు పరస్పరము రక్షలు కట్టుకొని ఆ బాధ్యతలకు కట్టుబడి ఉంటామనే సంకల్పం చేసుకోవాలి.

మానవుడు సంఘజీవి. సమాజాన్ని కాదని యే మానవుడు జీవించలేడు. అభివృద్ధి చెందలేడు. అయితే మన సమాజంలో వైవిధ్యం కన్పిస్తుంటుంది. అదొక ప్రత్యేకత, సమాజంలో మనకు బీద, ధనిక, వ్యత్యాసాలు, వివిధ కులాలు, అంటరానితనం వంటి దురాచారాలు కనిపిస్తుంటాయి. ఆ విభేదాలు అలా పెరిగి పోతుంటే సమాజం బలహీనమవుతుంది. సమాజం పటిష్ఠంగా, ఆరోగ్యవంతంగా ఉండాలంటే యీ లోపాలు తొలగి పోవాలి. వైవిధ్యం వెనుక నున్న ఏకాత్మతను, సమాజ రూపి పరమేశ్వర తత్వాన్ని దైవం మానుష రూపేణ అనే దైవతత్వాన్ని సమాజంలో ఆవిష్కరించడానికి యీ రక్షాబంధనం తోడ్పడుతుంది. అసమానతలను తొలగిస్తుంది. అందరినీ కలిపి ఉంచుతుంది. అందరినీ ఒకతాటి మీద నడిపిస్తుంది. అందుకే పరస్పరము రక్షలు కట్టుకోవాలి.

సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉంది. నేల విడిచి యెవరూ సాముచేయలేరు. ఈ దేశం, ఈ నేల, లేకుండా యెవరూ జీవించలేరు. అందుకే ఈ భూమిని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఇది సమిష్టి కృషి వల్లనే సాధ్యమవుతుంది. వ్యక్తులు సమిష్టిలో లీనం కావాలి. అప్పుడే వ్యక్తులైనా దేశమైనా, భూభాగాలైనా సురక్షితంగా ఉంటాయి. అందుకే అందరం పరస్పరం రక్షలు కట్టుకుంటూ సమిష్టిగా “నీవు నాకు రక్ష. నేను నీకు రక్ష. మనిద్దరం ఈ దేశానికి, ధర్మానికి, సంస్కృతికి రక్ష” అనే సంకల్పం తీసుకుంటూ రక్షను కట్టుకోవాలి. అదే అందరికీ శ్రీరామరక్ష. ఈ విధంగా బహుళ ప్రయోజనాన్ని కలిగిస్తున్న యీ పండుగల తత్వాన్ని పరమార్థాన్ని, అర్థాన్ని తెలుసుకొని ఆచరిస్తుండాలి.



హిందూ జీవనం పరిణామ శీలమైనది. కాలానుగుణంగా సమాజానికి ప్రయోజనాన్ని కలిగించే అంశాలను చొప్పించుకుంటూ ఆచరణలోకి తెచ్చుకుంటూ ఉండాలి. ఒక పసుపు సూత్రంతో మొదలైన దీక్షా ధారణ తరువాత తరువాత రంగురంగుల దారాలతో కళాత్మకంగా అందమైన రాఖీలుగా రూపాలను సంతరించుకుంటూ ఆకర్షణీయంగా ఉంటున్నాయి. అది మానవుల కల్పనా చాతుర్యం. తప్పులేదు. కాని దాని వెనుక నున్న ఆత్మీయత, సురక్ష, మానవ సంబంధాల వంటి మౌలికాంశాలలో మార్పు రాకూడదు. రాకుండా జాగ్రత్త పడాలి. ఈ రాఖీల తయారీ నేడొక గృహ పరిశ్రమగా, లఘు పరిశ్రమగా లక్షలాది కుటుంబాలకు జీవనోపాధిని కల్పిస్తోంది. ఇదే హిందూ జీవనంలోని సమగ్ర దృక్పథం. మానవీయ దృక్పథం.

**దేశ రక్షా సమం పుణ్యం, దేశ రక్షా సమం వ్రతం**
**దేశ రక్షా సమం యాగో, దృష్టోనైవచ నైవచ**

– సంఘ గీత ★

# స్నేహ మాంద్యం కలుగుతోందా?

డా॥ ఎ.వి.యస్.

సమాజంలో ఆర్థిక మాంద్యం గురించి విన్నాం. అలాగే కొద్దో గొప్పో బుద్ధి మాంద్యం గురించి కూడ విన్నాం. కాని నేడు వినిపిస్తున్న మరొక మాట స్నేహ మాంద్యం. దీనినే ఫ్రెండ్ షిప్ రెసెషన్ అంటారు. మనకు చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. ఒకప్పుడు పెన్ ఫ్రెండ్స్ ఉండేవారు. ఇప్పుడు కూడ సాంకేతికంగా ఛాటింగ్‌లు వగైరాల ద్వారా కూడ స్నేహితులు కలుగుతుంటారు. కాని మంచి చెడు విచక్షణ చాల కష్టమవుతుంది. పరిచయం కలిసిమెలసి చదువుకోవడం, ఉద్యోగంలో కలిసి పనిచేయడం వల్లనే మంచి స్నేహితులు లభిస్తుంటారు. నేడది బాగా కరువవుతోంది.

ఈ మధ్య ఒక దిన పత్రికలో చదివిన దానిని బట్టి "హార్వర్డు బిజినెస్ రివ్యూ" అనే పత్రిక ఒక విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. అమెరికన్ పర్‌స్పెక్టివ్స్ అనే ఒక అధ్యయన సంస్థ స్నేహసంబంధాల మీద ఒక అధ్యయనం చేసింది. సర్వే జరిపితే 90వ దశకంతో పోల్చి చూసినప్పుడు ఒక్క సన్నిహిత మిత్రుడు కూడ లేడని చెప్పిన వాళ్ళు అత్యధిక శాతం ఉన్నారు. 10 మంది కంటె ఎక్కువ స్నేహితులున్న వారి సంఖ్య కూడ చాల తక్కువే. ఏతా వాతా చెప్పొచ్చేదేమిటంటే స్నేహం చేయడం స్నేహితుల సంఖ్యను పెంచుకోవడం బాగా తగ్గి పోతోంది. గత రోజుల్లోకి వెళ్ళి చూస్తే స్నేహితులు, దగ్గరి స్నేహితులు, ప్రియమైన స్నేహితులు, సన్నిహిత స్నేహితులు. ప్రాణస్నేహితులు–ఇలా ఇన్ని రకాలుగా ఉంటుండేవారు. ఆలోచనలతో కష్టసుఖాలనో వాళ్ళతో పంచుకుంటుండేవారు. ఒకరుకాకపోతే మరొకరో సూచనలో, సలహాలో ఇస్తుండేవారు. అవసరమైతే మాట సహాయమో చేస్తుండేవారు. ఇంకా అవసరమైతే ధన సహాయమో సర్దుబాటు చేయుట యో చేస్తుండేవారేమో కూడ. అన్నిటికీ మించి నిరాశ నిస్పృహలను తొలగించి ఆత్మ విశ్వాసాన్ని కలిగించేవారు. హత్యలు, ఆత్మహత్యల వంటి వేవీ కూడ ఉండేవి కావు.

మిత్రులకు కొండంత అండగా నిలబడేవారు. ఇళ్ళల్లో యే శుభకార్యాలు జరిగినా పనుల్లో స్నేహితుల ప్రమేయం కూడ బాగా ఉంటుండేది. ఒక ఆనందమయ జీవనం స్నేహితుల ద్వారా లభించేది.

కాని ఇప్పుడటువంటి పరిస్థితులు కనిపిస్తున్నాయా? స్నేహమేరా జీవితం–స్నేహమేరా శాశ్వతం అన్నాడో కవి. చెలిమి శిలాక్షరము–కలిమి జలాక్షరమన్నాడొక రచయిత. భర్తృహరి కవి

పాపాన్ని వారయతి యోజయతే హితాయ।
గుహ్యం నిగూహతి గుణాన్ ప్రకటీ కరోతి॥
ఆపద్గతం చ న జహాతి దదాతి కావే।
సన్మిత్ర లక్షణ మిదం ప్రవదంతి సంత: ॥

అని సన్మిత్రుని లక్షణాలను చక్కగా వివరించి చెప్పాడు. మంచి మిత్రుడు తన తోటి వాడిని చెడు పనులు చేయకుండా చూస్తుంటాడు. అతనిలోని చిన్న చిన్న దోషాలను దాచి సద్గుణాలను బాగా ప్రచారం చేస్తాడు. దోషాలను వ్యక్తిగతంగానే చెప్పి సరిదిద్దే ప్రయత్నం చేస్తాడు. కష్టకాలంలో ఎవరైనా తప్పుదారిలో నడుస్తుంటే ముందు వాడి స్నేహితులెవరో ఎలాంటి వారో చూడండి అని పెద్ద వాళ్ళనడం కద్దు. విద్యాలయాల్లో హెడ్ మాస్టరో, టీచరో తల్లిదండ్రులను పిలిచి ఈ మధ్య మీ పిల్లవాడు సరిగా ఉండడం లేదు. కొంచెం ఫ్రెండ్స్ సర్కిల్ ఎటువంటిదో చూసుకుంటూ ఉండండి అని కూడ చెప్తుండడం చెవుల పడుతుండేది. కాబట్టి బుద్ధిమంతుడెప్పుడూ మంచి స్నేహితులను సమకూర్చుకోవాలనేది అనాది నుండి వస్తున్న జీవనశైలి. కాని నేడదికరవైంది. నేడు మనుషుల మనస్తత్వాల్లోనే నిర్లిప్తత వస్తోందా? ఇగోయిజం అడ్డు వస్తోందా? సాంకేతిక పరికరాలు అడ్డు పడుతున్నాయా? మనవ సంబంధాలు

(తరువాయి భాగం 14వ పుటలో...)

విజ్ఞానం

# ఘన విజయం ..కల్పక్కం



ఉపద్రష్ట లక్ష్మణసూరి

ప్రపంచమంతా వెనక్కి తిరిగి చూసేలా చేసిన **మన కల్పక్కం:** ప్రతి భారతీయుడు, ప్రతి తెలుగువాడు గర్వంగా తల ఎత్తుకోవాల్సిన చారిత్రాత్మక క్షణం!

మనం సాధారణంగా సినిమా నటుల సినిమా రిలీజ్‌లను లేదా క్రికెట్ ఆటగాళ్ల రికార్డులను మాత్రమే సోషల్ మీడియాలో సెలబ్రేట్ చేస్తాం. కానీ మన భవిష్యత్తునే మార్చబోయే ఒక పెద్ద నిజమైన మాయాజాలం, చెన్నైకి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న కల్పక్కంలో నిశ్శబ్దంగా జరిగిపోయింది. అవును! గత వారం, జూన్ 26, 2026న, భారతదేశం ప్రపంచ విజ్ఞాన చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని రాసింది.

అమెరికా, ఫ్రాన్స్ వంటి సూపర్ పవర్ దేశాలు కోట్ల రూపాయలు ఖర్చు చేసి, "ఇది మాకు సాధ్యం కాదు" అని వదిలేసిన ఒక అత్యాధునిక అణుశక్తి సాంకేతికతను, మన భారతీయ శాస్త్రవేత్తలు సాధించి చూపించారు. ఈ విజయం కేవలం యంత్రాల విజయం కాదు; ఇది భారతదేశ గర్వం, మన శాస్త్రవేత్తల దశాబ్దాల తపస్సు!

దీని గురించి ప్రతి సామాన్యుడు తెలుసుకోవాలి. ఎందుకు తెలుసా? ఇది మన పిల్లల భవిష్యత్తు భద్రతకు హామీ. రండి, కల్పక్కంలో ఏమి సాధించారో చూద్దాం.

తరగనంత అక్షయ పాత్ర - PFBR (Prototype Fast Breeder Reactor)

గత ఏప్రిల్ 6, 2026న, కల్పక్కంలోని PFBR అణు రియాక్టర్ తన మొదటి 'క్రిటికాలిటీ' (Criticality - అంతరాయం లేని గొలుసు అణు రియాక్షన్) స్థాయిని చేరుకుని విజయం సాధించింది. ఇది ప్రపంచ స్థాయిలో ఒక గొప్ప విజయం.

ఇది ఎందుకు అంత ప్రత్యేకమైనది?



సాధారణ అణు రియాక్టర్‌లను ఒక కట్టెల పొయ్యిగా ఊహించుకోండి. దానిలో 1 కిలో కట్టెలు వేస్తే, అవి కాలిపోయి వేడిని ఇచ్చి బూడిదగా మారిపోతాయి. కానీ కల్పక్కంలో మన శాస్త్రవేత్తలు తయారుచేసిన ఈ Fast Breeder Reactor అనేది ఒక అక్షయ పాత్ర పొయ్యి! ఇందులో మీరు 1 కిలో ఇంధనం వేస్తే, అది మీకు అవసరమైన విద్యుత్తును ఇవ్వడమే కాకుండా, అదనంగా 1.2 కిలోల కొత్త ఇంధనాన్ని కూడా మీకు తయారుచేసి ఇస్తుంది. అంటే, తాను వాడే ఇంధనం కంటే ఎక్కువ ఇంధనాన్ని ఇది ఉత్పత్తి చేస్తుంది. వినడానికి మాయా జాలంలా ఉందా? కానీ ఇదే నిజం!

మన నేల సంపద, మన చేతిలో - థోరియం కల: భారతదేశంలో యురేనియం చాలా తక్కువ. మనం విదేశాలపైనే ఆధారపడాలి. కానీ కేరళ మరియు తమిళనాడు సముద్రతీర ఇసుకలో 'థోరియం' అనే ఖనిజం పుష్కలంగా ఉంది. ప్రపంచంలోనే అత్యధిక థోరియం నిల్వలు ఉన్న దేశం భారతదేశమే!

డాక్టర్ హోమీ భాభా మరియు అబ్దుల్ కలాం కన్న కల ఇదే: "మన సొంత నేలలో ఉన్న థోరియంను ఉపయోగించి విద్యుత్ తయారు చేయాలి." కల్పక్కం ఈ విజయం ఆ మహా కలకు తలుపులు తెరిచింది. ఇక విద్యుత్ కోసం మనం ఏ విదేశానికీ చేయి చాచాల్సిన అవసరం



లేదు. రాబోయే 300 సంవత్సరాలకు భారతదేశానికి కావాల్సిన విద్యుత్‌ను మనమే తయారుచేసుకోవచ్చు!

ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన "గ్రీన్ హైడ్రోజన్" విజయం.

ఇప్పుడు జూన్ 26న జరిగిన ఆ గొప్ప మాయాజాలం దగ్గరకు వద్దాం. కల్పక్కంలో ప్రపంచంలోనే మొట్టమొదటి అణు-శక్తి సహాయంతో పనిచేసే హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభించబడింది.

**హైడ్రోజన్ ఎందుకు ముఖ్యం?**

భవిష్యత్తు ఇంధనం హైడ్రోజన్. పెట్రోల్, డీజిల్, బొగ్గును కాల్చితే నల్లని పొగ వస్తుంది, పర్యావరణం నాశనమవుతుంది. కానీ హైడ్రోజన్‌ను ఇంధనంగా ఉపయోగిస్తే పొగకు బదులుగా చివరికి వచ్చేది స్వచ్ఛమైన 'నీరు' మాత్రమే!

కానీ ఇందులో ఒక పెద్ద సమస్య ఉంది. ఈ మంచి హైడ్రోజన్‌ను తయారు చేయడానికి, నీటిని $H_2O$ విడగొట్టాలి. అలా విడగొట్టడానికి చాలా పెద్ద మొత్తంలో విద్యుత్ అవసరం. ఆ విద్యుత్‌ను తయారు చేయడానికి మళ్లీ బొగ్గును కాల్చాలి! ఇది "శుభ్రమైన ఇంట్లోకి చెత్తను తీసుకురావడం" లాంటి వైరుధ్యం.

**మన శాస్త్రవేత్తల అసాధారణ పరిష్కారం:-**

కల్పక్కం IGCAR శాస్త్రవేత్తలు ఒక అద్భుతమైన మార్గాన్ని కనుగొన్నారు. అణు రియాక్టర్‌లో విద్యుత్ తయారు చేసేటప్పుడు వెలువడే అపారమైన వేడిని వృథా చేయకుండా నేరుగా ఉపయోగించి, 'కాపర్-క్లోరిన్ సైకిల్' పద్ధతిలో నీటిని వేడి చేసి, విడగొట్టి హైడ్రోజన్‌ను తయారుచేశారు. అంటే, ఎటువంటి కాలుష్యం లేకుండా, వాతావరణంలో ఒక్క కార్బన్ కణాన్ని కూడా విడుదల చేయకుండా, ప్రపంచంలోనే అత్యంత స్వచ్ఛమైన హైడ్రోజన్‌ను అణుశక్తి ద్వారా తయారుచేసి భారతదేశం ప్రపంచానికే దారి చూపింది.

**మంటతో ఆడిన నిశ్శబ్ద నాయకులు:-**

ఈ విజయాలు ఒక్క రాత్రిలో జరగలేదు. సాధారణ అణు రియాక్టర్లలో వేడిని తగ్గించడానికి నీటిని ఉపయోగిస్తారు. కానీ ఈ Fast Breeder అణు రియాక్టర్‌లో వేడిని తగ్గించడానికి 'ద్రవ సోడియం' (Liquid Sodium) అనే లోహాన్ని ఉపయోగించాలి.

సోడియం ఎంత ప్రమాదకరమైనదో తెలుసా? అది గాలితో కలిస్తే మంటలు వస్తాయి; నీటితో కలిస్తే పేలిపోతుంది! ఇంతటి ప్రమాదకరమైన ద్రవ లోహాన్ని నిర్వహించడం అనేది కనుమరుగు విద్య కంటే కష్టం. చాలా విదేశాలు ఈ ప్రమాదానికి భయపడి తమ పరిశోధనను మూసివేశాయి.

కానీ మన భారతీయ శాస్త్రవేత్తలు? గత కొన్ని దశాబ్దాలుగా, రాత్రింబవళ్లు ఆలోచించి, సురక్షితమైన సాంకేతికతలను స్వదేశంలోనే అభివృద్ధి చేసి, ఈ ద్రవ సోడియంను ఒక పిల్లవాడిలా నిర్వహించి విజయం సాధించారు. దీని కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఆ పేరు తెలియని శాస్త్రవేత్తల పాదాలను మనమందరం తాకి నమస్కరించాలి.

**సామాన్యులైన మనకు దీనివల్ల ఏమి ఉపయోగం?**

**తక్కువ ధరకు విద్యుత్:-** ఇక బొగ్గు కొరత అనే మాటకే తావు ఉండదు. తమిళనాడు సహా భారతదేశమంతా అంతరాయం లేని, చౌకైన విద్యుత్ లభిస్తుంది.

**ఆర్థిక వృద్ధి:-** గల్ఫ్ దేశాల్లో యుద్ధం జరిగితే పెట్రోల్ ధర పెరుగుతుందని ఇక మనం భయపడాల్సిన అవసరం లేదు. మన సొంత హైడ్రోజన్ ఇంధనంతో మన పరిశ్రమలు నడుస్తాయి.

**స్వచ్ఛమైన గాలి:-** కార్బన్ ఉద్గారాలు పూర్తిగా తగ్గి, మన

(తరువాయి భాగం 12వ పుటలో...)

# వరలక్ష్మీ వ్రతం - సామాజిక స్పృహ



- కోట లక్ష్మీఅన్నపూర్ణ

హిందూ ధర్మాన్ని అనుసరిస్తూ ఆచరించేది పండుగలు, జాతరలు, ఉత్సవాలు, వేడుకలు, నోములు, వ్రతాలు అన్నీ కూడా ఐహిక ప్రయోజనాలతో పాటు పార లౌకిక ప్రయోజనాలు కూడా సాధింపబడుతాయి. హిందూ ధర్మ పరిరక్షణకు కేంద్ర బిందువు కుటుంబం. కుటుంబంలో స్త్రీ పాత్ర కీలకమైనది. ఎందుకంటే స్త్రీ కేవలం తన క్షేమాన్ని మాత్రమే కోరుకోదు. తన కుటుంబ క్షేమాన్ని కోరుకుంటుంది. వారి క్షేమాన్నే తన క్షేమంగా భావిస్తుంది. అందుకోసం అహర్నిశలూ శ్రమిస్తుంది. కుటుంబ శ్రేయస్సుకోసం భగవంతుడి అనుగ్రహం కావాలి. నోములు, వ్రతాలు, భగవండి అనుగ్రహాన్ని కలిగిస్తాయి. నోములు నోచుకోవాలన్నా, వ్రతాలు చేసుకోవాలన్నా కొన్ని నియమనిబంధనలుంటాయి. వేకువజామున మేల్కొనడం, శుచీశుభ్రతలను పాటించడం. ఇంటిని, ఇంటి పరిసరాలను శుభ్రంచేయడం, అందంగా అలంకరించడం, పూజా ద్రవ్యాలను సమకూర్చుకోవడం వంటివి క్రమశిక్షణను అలవరుస్తాయి. స్తోత్రాలు, పూజలు, కథల ద్వారా భాషాపరిజ్ఞానం, స్పష్టమైన ఉచ్చారణ, ఏకాగ్రత, పెరుగుతాయి. కొన్ని ప్రత్యేకమైన నైవేద్యాల ద్వారా ఆరోగ్యం కూడా పరిరక్షించబడుతుంది. ఇలా ప్రతి యింటా స్త్రీలు మంచినడవడికను కలిగివుంటే కుటుంబంతో పాటు సమాజమంతా శ్రేయస్సును పొందుతుంది. ఉదాహరణకు వరలక్ష్మీ వ్రత విషయాన్నీ పరిశీలిస్తే కొన్ని విషయాలు మనకు తేట తెల్లమవుతాయి. వరలక్ష్మీ వ్రతం వర్షఋతువులో, శ్రావణ మాసంలో వస్తుంది. అందమైన చామంతులు, బంతిపూలు, రకరకాల పళ్ళు కూడా విరివిగా లభించే సమయం. రాఖీపౌర్ణమి, కృష్ణాష్టమి మొదలైన పర్వదినాలు గల సమయం అటువంటి సమయంలో వచ్చే వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకోవడానికి స్త్రీలంతా ఎంతో



ఉత్సాహంగా ఎదురుచూస్తారు. ఆనాడు చారుమతి చేసిన వరలక్ష్మీ వ్రతాన్నే నేటికి భక్తిశ్రద్ధలతో చేస్తూఉంటారు.

స్త్రీలు సహజంగా సున్నితహృదయం కలవారు, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నో దారుణాలకు స్త్రీలు కారకులు కావడం, సమాజాన్ని కలవరపరుస్తున్న విషయం. ఈ పరిస్థితిని నివారించాలి. స్త్రీలు మంచి భావనలను కలిగివుంటూ సదాచారాన్ని పరిరక్షించాలి. అందుకు ఇటువంటి వ్రతాలు దోహదపడతాయి. వరలక్ష్మీ వ్రత విధానంలో కథ, వ్రత విధానము, వ్రత మాహాత్మ్యము అందరికీ తెలిసినవే! వ్రత విధానాన్ని అనుసరించి వరలక్ష్మీ వ్రతాన్ని చేసుకోవడమే కాకుండా సామాజిక స్పృహను కలిగివుండి వ్రత కథలోని అంతరార్థాన్ని తెలుసుకుని ఆచరిస్తే

మంచి ఫలితాలు ఉంటాయి. అందరికీ మేలు కలుగుతుంది. ఈ కథలోని చారుమతి అనే స్త్రీ పేరు ఎంత అందమైనదో ఆమె బుద్ధికూడా అంతే మంచిది. అందమైన బుద్ధి అని దీనికి అర్థం, ఆమెలో వినయవిధేయతలు ఎక్కువ ఆమె అత్తమామలను, భర్తను సేవిస్తూ ఉండేది. అంటే కుటుంబం నుండి అనే భావనతో కుటుంబ బాధ్యతను స్వీకరించగలిగింది. అంటే ఆమె కుటుంబాన్ని ఆదర్శ కుటుంబంగా తీర్చిదిద్దగలిగిన తెలివితేటలు గలది. ఒకనాడు ఆమెకు కల వచ్చింది. లక్ష్మీదేవి కలలో కనిపించి తనను పూజించమని చెప్పి అంతర్ధానమైనది. ఈ విషయాన్ని తనవారందరికి దాపరికము లేకుండా చెప్పింది. అంటే ఈమెలో కల్మషంలేదు, స్వార్థంలేదు. సాక్షాత్తు అమ్మవారే ఆజ్ఞాపించినా భర్త, అత్తమామల అనుమతి తీసుకుంది. అంటే వారికి నచ్చిన విధంగా ఒప్పించింది. తాను ఒక్కతే ఆ ఫలాలను పొందాలనే అత్యాశపడలేదు. తనతోపాటు ఇరుగు పొరుగు వారందరిని కలిసి ఆ వ్రత పూజలో పాలుపంచుకునేలా చేసింది. ఇది ఆమెలోని సామరస్యధోరణికి నిదర్శనం. ఇక్కడ నాయకత్వలక్షణాలు



కూడా కనిపిస్తాయి. ఇక ఆమెలో భక్తి ప్రపత్తులకు కొదవలేదు. యధావిధిగా, యధాశక్తిగా పూజచేసింది. ఇందులో ఆడంబరాలు లేవు. నానబెట్టిన శనగలు, పండ్లు, తాంబూలం, వాయినాలను సమర్పించింది. ఇవన్నీ బలవర్ధకమైన పోషక పదార్థాలు, ఆరోగ్యానికి మేలు చేసేవి. ఇలా వ్రతం పూర్తి కాగానే వ్రతం ఫలించి అందరి ఇళ్ళూ సిరిసంపదలతో నిండిపోయాయి. కుటుంబంలోని వారిని ఆనందంగా ఉంచుతూ చేస్తేనే పూజలను భగవంతుడు స్వీకరిస్తాడు అనేది దీని ద్వారా తెలుస్తున్నది.

వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి అమ్మవారి ఆశీస్సులను అందుకోవడం ఎంత ముఖ్యమో, అందుకు తగిన యోగ్యతను కలిగి వుండడం కూడా అంతే ముఖ్యం. ఈ రకమైన దృక్పథాన్ని అలవరచుకుని చేస్తే ఏ వ్రతమైనా సకల శుభాలను కలిగిస్తుంది. ఇంట్లో బంగారాన్ని సమకూర్చడమే కాదు, ఇంటి బంగారంగా, దేశసంపదగా కీర్తించేస్థాయిలో స్త్రీలు ఉంటే సమాజానికి శ్రేయస్సు చేకూరుతుంది. హిందూ ధర్మం పటిష్ఠమవుతుంది. ★

---

(8వ పుట తరువాయి భాగం ...)

తదుపరి తరం పిల్లలు కాలుష్యం లేని స్వచ్ఛమైన గాలిని పీలుస్తారు.

**జాతీయ భద్రత:-** ఇంధనంలో మనం ఎవరిపైనా ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించినప్పుడు, ప్రపంచ వేదికపై భారతదేశ సూపర్ పవర్ పట్టు మరింత బలపడుతుంది.

గర్వంగా షేర్ చేయండి!

కల్పక్కం అనేది ఇక కేవలం ఒక ఊరి పేరు కాదు; అది భారతదేశ శాస్త్రీయ ఆత్మవిశ్వాసానికి చిహ్నం. ఎన్నో అడ్డంకులు, సాంకేతిక ఆంక్షలు, విదేశాల విమర్శలను అన్నింటినీ తుడిచిపెట్టి, ఈరోజు అణుశక్తి మరియు హరిత శక్తి రంగంలో భారతదేశం ప్రపంచ సింహాసనంపై గర్వంగా కూర్చుంది.

క్రీడా విజయాలను జరుపుకునే మనం, దేశం యొక్క తలరాతనే మార్చబోతున్న ఈ గొప్ప శాస్త్రీయ విజయాన్ని కూడా జరుపుకుందాం. ఈ సందేశాన్ని చదివే ప్రతి ఒక్కరూ దీన్ని షేర్ చేయండి. మీ పిల్లలకు కల్పక్కం శాస్త్రవేత్తల ఈ విజయాన్ని గర్వంగా చెప్పండి. "భారతదేశం చేయగలదా?" అని అడిగిన ప్రపంచం ముందు, "భారతదేశం మాత్రమే చేయగలదు!" అని నిరూపించిన ఆ గుండెలకు మన రాయల్ సెల్యూట్! ★

పద్యం–పరమార్థం

# రక్తి–శక్తి–భక్తి–ముక్తి !!



✍ ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి

ఒకప్పుడు గొంతెత్తి పద్యాలు పాడుతూ బండ్లు నడిపే వాళ్ళు, మోట (కపిల) కొట్టేవాళ్ళు, నాగలి పట్టి దున్నే వాళ్ళను చూశాం! పద్యాలే కాక పల్లెపాటలు (జాన పద గీతాలు) కూడా పాడే వారు.

ఇప్పుడు బండ్లకు మారుగా ఆటోరిక్షాలూ – ట్రాక్టర్లు వచ్చినై. మోటలకు మారుగా కరెంటు మోటార్లు వచ్చినై. నాగళ్ళకు మారుగా ట్రాక్టరు నాగళ్ళు వచ్చినా, 80 శాతం వ్యవసాయం నాగళ్ళతోనే నడుస్తున్నది. అయితే అవి నడిపేవారు పద్యాలూ – జాన పద గీతాలు పాడడంలేదు; సినిమా పాటలు పాడుతున్నారు.

అయితే భజన సంప్రదాయంలో ఇంకా పద్యాల ప్రభావం కొనసాగుతూనే ఉంది. కార్తీక భజనల్లో, గణపతి నవరాత్రుల్లో శరన్నవరాత్రుల్లో, చైత్ర నవరాత్రుల్లో ఎంత పాశ్చాత్య సంస్కృతీ ప్రభావం పడ్డా, గృహ సీమల్లో , ఆధ్యాత్మిక ప్రాంగణాల్లో, దేవాలయాల్లో , భక్తి సంబంధి ఉత్సవాల్లో, భజనలు చేస్తూనే ఉన్నారు. భక్త రామదాసు, రాకమచర్ల వెంకటదాసు, హనుమద్దాసుల కీర్తనలు చెప్పుకొంటున్నారు. (వేపూరు, మన్యంకొండ, బీబీపేట హనుమద్దాసులు వీరు ముగ్గురు నలుగురున్నారు) కీర్తనకు కీర్తనకు మధ్యన ఎవరో పద్యం అందుకొంటున్నారు; పోటీలు పడి పద్యాలు పాడుతున్నారు.

ఛందోబందో బస్తులు త్రెంపి పారేద్దామనీ, పద్యాల నడుముల్నీ దుడ్డు కర్రతో విరగ్గొట్టాలనీ, తద్వార భారతీయ పౌరాణిక – వేద – ఉపనిషత్ – ధార్మిక సాహిత్యాన్ని అంతంచేయాలనుకొన్న సామ్యవాదుల దురాలోచనల్ని పద్యం మట్టికరిపించింది. అందుకే ఈనాటికీ కృష్ణ, వేమన, సుమతీ, భాస్కరా, నరసింహ, దాశరథీ, రామరామ .... శతక పద్యాలు జనంనోట ఆడుతున్నాయి.

అలాంటి శతకాల్లో ధర్మపురి నరసింహాశతకం శ్రీకాకుళం నుండి సిద్ధిపేట వరకు ప్రసరిస్తూ తన సందేశాల ద్వారా సామాజిక చైతన్యానికి దోహదం చేస్తున్నది. ఆ శతకంలోని తల్లిగర్భమునుండి, నరసింహ నీ దివ్య నామ మంత్రము చేత, బ్రతికియున్నన్నాళ్ళు, పసరంబు బందైన .... వంటి అనేక పద్యాలు పెద్దల నోట సందర్భానుగుణంగా వినిపిస్తూనే ఉన్నాయి. అటు వంటి వాటిలో ఈ క్రింది పద్యం కూడా ఒకటి.

**సీ॥ గౌతమీస్నానాన కడతేరుదామంటె**
**మొనసి చన్నీళ్ళలో మునగలేను**
**తీర్థయాత్రలచే కృతార్థుడౌదామంటె**
**బడలి నేమంబు నే నడుపలేను**
**దాన ధర్మముల సద్గతిని జెందుదమంటె**
**ఘనముగా నా వద్ద ధనములేదు**
**తపమాచరించి సార్థకత నొందుదమంటె**
**నిమిషమైన మనసు నిలుపలేను**
**గీ॥ కష్టముల కోర్చ నా చేత కాదు, నిన్ను**
**స్మరణ చేసెద నాయథాశక్తి కొలది**
**భూషణ వికాస! శ్రీధర్మపురనివాస !**
**దుష్టసంహార నరసింహ దురిత దూర !**

గోదావరిలో స్నానం చేసి ముక్తి పొందుదామనుకొన్నాను; కానీ ప్రయత్నించినా నేను చన్నీళ్ళలో మునిగే స్థితిలోలేను. దేశంలో తీర్థయాత్రలు చేసి పుణ్యం మూట కట్టుకొందామనుకొన్నాను; అయితే నా అలసట కారణంగా నియమాలననుసరించి నేను నడువలేను బీదసాదలకు దానధర్మాలు చేసి పుణ్యగతులను పొందాలను కొన్నాను; నా వద్ద వారికి దానధర్మాలు చేయడానికి ఎక్కువ ధనం లేదు. పోనీ తపస్సు చేసైనా జీవన సాఫల్యాన్ని

పొందుదామనుకొన్నాను; కానీ, ఒక నిమిషంకూడా నా మనస్సు నిలుపలేక పోతున్నాను.

కష్టాల కోర్వడం నా వల్ల కాదు. నా యధాశక్తి కొలది నీ నామస్మరణం చేస్తాను. ఓ స్వామి! శ్రీధర్మపుర నివాసా! సొమ్ముల చేత ప్రకాశిస్తూ వ్యాపించి ఉన్న ఓ మహాస్వామి! దుష్టులను అంతం చేసే దివ్యమూర్తి! పాపాలను దూరం చేసే పావనమూర్తి!

శ్రీ ధర్మపురి నరసింహ శతక కర్త శేషప్ప మహాకవి. ఉమ్మడి కరినగరం జిల్లాలోని ధర్మపురినివాసి. కృష్ణ శతక కర్తకూడా ఈయనే. ధర్మపురిలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దివ్యమందిరమున్నది. ధర్మపురిని తాకుతూనే గోదావరి నది ప్రవహిస్తున్నది. భక్తులు గోదావరిలో స్నానం చేసి స్వామి వారిని దర్శించుకొని ధన్యులవుతారు.

ఈ భక్తుడు మోక్షాన్ని అర్థిస్తున్నాడు. కాని చన్నీళ్ళతో (గోదావరిలో స్నానం చేసే శక్తి లేదు. అలసట కారణంగా అంటే శరీరంలో శక్తిలేని కారణంగా నడువలేని స్థితి ఉంది. దానధర్మాలు చేసి ముక్తి పొందుదామనుకుంటె తన దగ్గర ధనం లేదు. తపస్సు ద్వారా తరిద్దామనుకొంటె మనస్సు ఏకాగ్రతతో ఉండడం లేదు. అతని శరీరం మరి ఏకష్టాలనూ భరించే స్థితిలో లేదు. అయితే ఒక దగ్గర కూర్చొని నామస్మరణ చేసే శక్తి ఉంది స్వామి! నన్నుద్ధరించుమని ప్రార్థిస్తున్నాడు.

ఈ అవస్థ ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పద్యం వర్తిస్తుంది. అందుకే నామ మహిమను చెబుతూ జానపదులలో మంచి పద్యం ఇలా కట్టుకొన్నారు. చూడండి!

**రామ రామయన్న రారాదు పాపంబు**
**రామ రామయన్న రాదు భయము**
**రామ రామయన్న రారాదు మృత్యువు**
**రామ నామ మమృత రాశియగును**

ఈ పద్యం కట్టినాయనకు చేయెత్తి దండం పెట్టాలి. అయితే మా గురువు గారు డా॥ ముకురాల రామారెడ్డి గారు నామస్మరణం కాదు మందు (ఔషధం) పడాల్సిందే అంటున్నారు.

**రామ రామయన్న రాదా కడుపు నొప్పి**
**వామ వామ యనుచు వామ దినక**
**మందు లేక పుండు మాటల మానునా!**
**పుట్టగోచి లింగ! పూల రంగ !**

ఏ మందాం! ఈ యిద్దరిని సమన్వయించి వామతింటూ తింటూ రామా రామా అని కూడా అందాం! వామ తింటు మనము రామరామాయంటు / పనులు చేసుకొంటు బ్రదుకుదాము / దేహమునకు మందు దేహికి మరి భక్తి / పుట్టగోచిలింగ పూలరంగ.

అవును మనకు రక్తి, శక్తి, భక్తి, ముక్తి ఈ నాలుగూ కావాలి. ఆహా! ఒక పద్యం ఎంత గొప్ప సందేశాన్ని అందించింది. చూడండి! ★

---

(8వ పుట తరువాయి భాగం ...)

బలహీనమవుతున్నాయా? ఒక్కసారి అంతర్మథనం చేసుకోవాలి.

ఈనాడు యువతలో చోటు చేసుకుంటున్న అనేక రుగ్మతలకు, జాడ్యాలకు కారణాలేమై యింటాయని ప్రశ్నించుకొన్నప్పుడు చలన చిత్రాల ప్రభావమో మరొకటో అని చెప్పినవ్పటికీ యువత మధ్య సరియైన స్నేహబంధమేర్పడక పోవడం ప్రధాన కారణంగా భావించవచ్చు. స్నేహితులుంటారు. కాని స్నేహ బంధము ఉండదు. ఆ బంధమే ఉంటే పరస్పరము తప్పులు చేయకుండా జాగ్రత్త వహిస్తూ ఒకరికొకరు అండగా నిలుస్తారు. వర్చువల్ స్నేహాలకంటె ఆయిల్ స్నేహాలు గొప్పవనే విషయాన్ని మరచిపోకూడదు. ★

---

**మీ జీవితానికి మీరే బాధ్యులు. మీరే సృష్టించు కోగలుగుతారు. ఉన్నతంగా ఎదగడానికి తగిన కృషి చేయండి.**

★

# దేశ గౌరవం కోసం ఆట ఆడండి.

మేజర్ ధ్యాన్‌చంద్

– తేజస్విని

అది 1936వ సం॥రం. ఒలంపిక్స్ గేమ్స్ కు జర్మన్ దేశం స్వాగతం పలికింది. భారతదేశం నుండి కూడ చాలమంది క్రీడాకారులు పాల్గొన్నారు. హాకీ ఆడటానికి కూడ ఒక జట్టు బయలు దేరింది. హాకీ ఫైనల్ మాచ్ భారత్‌కు జర్మనీతో తలపడవలసి వచ్చింది. ఆ పోటీలోనే గెలిచిన వారికి స్వర్ణపతకం లభిస్తుంది. జర్మనీ ఫైనల్ మాచ్‌లో ఉంది కాబట్టి ఆ దేశాధినేత హిట్లర్ ఫైనల్ మాచ్ చూడాలని స్టేడియంలోకి వచ్చి కూర్చున్నాడు. ఆట ప్రారంభమైంది.

వరుసగా 1,2 గోల్స్ జర్మన్ క్రీడాకారులు సాధించుకుంటూ వచ్చారు. స్టేడియంలోని జర్మన్ పౌరులలో ఉత్సాహం, ఉల్లాసం పొంగి పొరలుతోంది. హిట్లర్‌లో కూడ విజయం తమదే స్వర్ణం కూడ తమకే దక్కుతుందనే ప్రగాఢ నమ్మకం కలిగింది. మరోవైపు భారత క్రీడాకారుల్లో నిరాశ, నిస్పృహలు అలుము కున్నాయి. కొందరిలోనైతే ఓటమి ఖాయం అనే భావన కూడ. అప్పటికే ఆట సమయం సగం పూర్తయింది. అటువంటి వాతావరణంలోనే మిగతా సగం సమయంలో తమ జట్టు ఆడి గెలవాలి. జట్టు నాయకుడు మాత్రం నిరాశ పడలేదు. జట్టులోని క్రీడాకారులనందరినీ ఒక్కసారి పరికించి చూశాడు. వీరంతా నైపుణ్యం కలిగిన క్రీడాకారులే గదా! ప్రతిభ ఉన్న వారే గదా! ఎక్కడో లోపం ఉంది. సరిదిద్దాలనుకున్నాడు. ఆశ చిగురించింది. అంతే విరామ సమయంలో స్టేడియం అంతా పరుగెత్తుతూ భారత క్రీడాకారులను కలుసుకుంటూ సగం ఆట అయింది. ఇప్పటి వరకు మీరు మీ ప్రతిభను చూపించుకోవడం కోసం ఆడారు. మిగిలిన సగం దేశగౌరవం కోసం ఆడండి. దేశ ప్రతిష్ఠ పెంచడం కోసం ఆడండి. దేశం గెలిస్తే మీరు గెలిచిన దేశంలో ఆటగాళ్లుగా గుర్తింపబడతారు. దేశంకోసం మన ఆట ఉండాలి. అని చెప్తూ భుజాలు తడుతూ ముందుకు వెడుతూ ఆట మళ్ళీ ప్రారంభించారు. ఒక్క క్షణం ఆటగాళ్ళు ఆలోచించి ఆటలో పాల్గొన్నారు.

మిగతా సమయం ఆట ప్రారంభమైంది. ఆట గాళ్ళల్లో నిరాశ పటాపంచలైంది. ఆత్మవిశ్వాసం నెలకొంది. కెప్టెన్ అందరినీ సమన్వయ పరుస్తూ కెప్టెన్ ఆటలో రెచ్చిపోయాడు. వరుసగా 12 గోల్స్‌ను కొట్టుకుంటూ వచ్చి అఖండ విజయాన్ని సాధించిపెట్టాడు. క్రీడా మైదానంలో కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. కెప్టెన్ ప్రతిభను చూసి అందరూ ఆశ్చర్యచకితులయ్యారు. ఒలింపిక్స్‌లో హాకీలో భారత్ స్వర్ణపతకం సాధించింది.

తరువాత రోజు హిట్లర్ భారత్ కెప్టెన్‌ను పిలిపించుకున్నాడు. నీ దేశంలో నీవేం చేస్తుంటావు? అని అడిగాడు. నేనొక సైనికుణ్ణి అని జవాబిచ్చాడు. ఒస్ ... అంతేనా నా దేశానికి రా! సైన్యంలో ఉన్నత పదవినిస్తాను. నిలువెత్తు ధనమిస్తాను. నా జర్మను దేశ పక్షాణ హాకీ ఆడి విజయాలను తెచ్చిపెట్టు అని ఆహ్వానించాడు. మౌనంగా విన్న భారత హాకీ కెప్టెన్ స్వాభిమానంతో సగర్వంగా తలయెత్తి గొంతు విప్పి నా దేశాన్ని నేనమ్ముకోను. నా దేశ ప్రతిష్ఠకే నా ఆటను అంకితం చేస్తానన్నాడు. ఆ క్రీడాకారునిలోని దేశ భక్తికి నిశ్చేష్టుడయ్యాడు జర్మను నియంత హిట్లర్.

ఆ హాకీ క్రీడాకారుడు, జట్టు నాయకుడే ధ్యాన్‌చంద్. భారతదేశం తరువాత సైన్యంలో మేజర్ పదవినిచ్చి గౌరవించింది. మేజర్ ధ్యాన్‌చంద్ అయ్యాడు. ప్రధాని మోదీ భారతదేశంలో అత్యున్నత పురస్కారమైన "భారత రత్న" బిరుదు ఇచ్చి సత్కరించారు. వరుసగా 12 గోల్స్‌ను కొట్టిన ధ్యాన్‌చంద్ గౌరవార్థం వియన్నాలో స్పోర్ట్స్ క్లబ్ తన ప్రాంగణంలో నాలుగు చేతుల్లో నాలుగు హాకీ స్టిక్స్ పట్టుకొని ఉన్న మేజర్ ధ్యానచంద్ విగ్రహాన్ని ప్రతిష్ఠించింది. **దేశ ప్రతిష్ఠకోసమే ప్రతి ఒక్కరు అంకితం కావాలి!** ★

# ఆత్మ నిర్భర్ భారత్ -1

**ఆ**త్మ నిర్భర భారత్ (మేకిన్ ఇండియా) వైపు మన భారత దేశం వేగంగా అడుగులు వేస్తోంది. వివిధ రంగాలలో ఇప్పటికే మన దేశం తయారు చేసిన వివిధ రకాలైన వస్తువులు వినియోగంలోకి వచ్చేస్తున్నాయి. దీని ద్వారా ఇతర దేశాల నుంచి దిగుమతులు కూడా తగ్గుతున్నాయి. దీంతో మన దేశ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం అవుతోంది. దీంతో మన ప్రజల ఆత్మ విశ్వాసం కూడా పెరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా భారత్ ఎంత బలంగా వుందో సత్తా చాటినట్లు కూడా అవుతోంది.

తాజాగా ప్రముఖ స్పేస్ టెక్ స్టార్టప్ "స్కైరూట్ ఏరోస్పేస్" పూర్తి మన స్వదేశీ టెక్నాలజీతో ప్రతిష్ఠాత్మకంగా ప్రైవేట్ ఆర్బిటల్ క్లాస్ రాకెట్ విక్రమ్-1" ప్రయోగం విజయవంతం అయ్యింది. ఇలా... ఇప్పటికే మన భారత దేశం స్వదేశీ టెక్నాలజీతో కొన్నింటిని ఆయా రంగాలలో తయారు చేసింది. అవి విజయవంతం కూడా అయ్యాయి. అందుకే "ఆత్మ నిర్భర భారత్" అనే శీర్షికతో వాటి గురించి వివరంగా విద్యార్థుల కోసం "స్ఫూర్తి" అందిస్తోంది.




**"విక్రమ్ -1" స్పెషాలిటీస్ ఇవే...**

భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైపోయింది. మొట్ట మొదటి సారిగా ఓ ప్రైవేట్ స్పేస్ టెక్ స్టార్టప్ సంస్థ "స్కై రూట్ ఏరోస్పేస్" దీనిని రూపొందించింది "మిషన్ ఆగమన్" పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం... హైదరాబాద్ కి చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ పూర్తి స్వదేశీ టెక్నాలజీతో రూపొందించింది. శ్రీహరి కోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి దీనిని విజయవంతంగా ప్రయోగించారు. నిర్దేశిత 450 కి.మీ. భూ దిగువ కక్ష్యలోకి ఆరు పేలోడ్లను కచ్చితత్వంతో ప్రవేశపెట్టారు. దీంతో ప్రైవేట్ ఆర్బిటాల్ లాంచ్ సామర్థ్యం వున్న ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ రికార్డు సృష్టించింది.

మన దేశ అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ భారత ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలకు ఈ విజయం పెద్ద మైలురాయిగా నిలిచింది. ఇస్రోకి చెందిన మాజీ శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాగా కలిసి 2018 లో ఈ "స్కైరూట్ ఏరోస్పేస్" సంస్థను స్థాపించారు. చిన్న ఉపగ్రహాల మార్కెట్ లో తక్కువ ఖర్చుతో, నమ్మకమైన సేవలను అందించాలన్న లక్ష్యంతో వారు ప్రయాణాన్ని ప్రారంభించారు.

**ప్రముఖుల పేర్లు పెట్టిన నిర్వాహకులు**

భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ గౌరవార్థం ఈ రాకెట్ కి "విక్రమ్" అని పేరు పెట్టారు. అలాగే ఈ రాకెట్ లో మొత్తం 4 దశలుంటాయి. వాటిలో 1 నుంచి 3 దశలు ఘన ఇంధనంతో పనిచేస్తాయి.

2. ఇక.. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గౌరవార్థం వాటికి "కలాం ఇంజన్లు" అని పెట్టారు. ఇవి రాకెట్ పైకి వెళ్లడానికి అవసరమైన శక్తిని అందజేస్తాయి.

3. ఇక నాలుగో దశ పూర్తిగా ద్రవ ఇంధనంతో

(తరువాయి భాగం 28వ పుటలో...)

# ఆర్ఎస్ఎస్‌తో వీవీ గిరి, ప్రణబ్ ముఖర్జీ

ఆర్.ఎస్.ఎస్. చరిత్ర గురించి కేరళ సీఎం వీడీ సతీశన్‌కు పెద్దగా తెలియక పోవడం విచారకరం. మహాత్మాగాంధీ, బి.ఆర్. అంబేద్కర్, కైలాశ్ నాథ్ కట్జు (నెహ్రూ కేబినెట్‌లో హోం మంత్రిగా, మధ్యప్రదేశ్ సీఎంగా పనిచేశారు) వంటి ప్రముఖులు ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలకు హాజరైన వారిలో ఉన్నారు. ఇదే విషయమై కైలాశ్‌నాథ్ కట్జును నెహ్రూ, ఇతర కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించినప్పుడు, “ఒకసారి మీరు ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో పాల్గొంటే, స్వయంసేవకులను ప్రశంసించకుండా ఉండలేరు. స్వయంసేవకులకు అటువంటి క్రమశిక్షణ, అంకితభావం ఉంటాయి” అని ఆయన బదులిచ్చారు. 2018లో మాజీ రాష్ట్రపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రణబ్ ముఖర్జీ నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ సరసంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్‌తో కలిసి ఒకే వేదికను పంచుకున్నారు. ఆ పర్యటన సందర్భంగా, ఆయన సందర్శకుల పుస్తకంలో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ హెడ్గేవార్ “భారతమాత ముద్దుబిడ్డ”గా అభివర్ణిస్తూ రాశారు. ఆయన పదవిలో ఉన్నప్పుడు మోహన్ భాగవత్‌కు రాష్ట్రపతి భవన్‌లో ఆతిథ్యం కూడా ఇచ్చారు. మే 15, 1983న హరిద్వార్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్మితమైన ‘భారతమాత మందిరాన్ని’ అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ప్రారంభించా...



సెప్టెంబర్ 2, 1970న కన్యాకుమారిలో వివేకానంద స్మారక చిహ్నాన్ని అప్పటి రాష్ట్రపతి వీవీ గిరి ప్రారంభించారు.



ఆదర్శ నగర్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ నిర్మల్ ఆదర్శ నగర్ పాఠశాలలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేశారు. ఓటింగ్ ప్రక్రియలో విద్యార్థులు పాల్గొన్నారు.

# వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక



గోరింటాకు కార్యక్రమం, కుషాయిగూడ



శ్రీ సరస్వతీ శిశు మందిర్ కిసాన్ గల్లీ కి చెందిన 2003-2004 బ్యాచ్ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కోసం 76,450 రూపాయలను పాఠశాల కమిటీకి అందించారు.





మఖ్తల్ :- శ్రీ సరస్వతీ శిశుమందిర్ మఖ్తల్ పాఠశాల పూర్వ విద్యార్థి,ప్రముఖ వ్యాపార వేత్త శ్రీ వట్టం రతన్ కుమార్ గుప్త పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ మరియు ప్రీ ప్రైమరీ విద్యార్థులకు 12 స్టడీ టేబుల్స్ అంజేశారు.




శ్రీ సరస్వతీ శిశు మందిర్ శివరాంపల్లిలో పాఠశాలను వాసవి క్లబ్ బృందం సందర్శించింది. పాఠశాల పూర్వ విద్యార్థి సహకారంతో వారు విద్యాపీఠం, సరస్వతీ శిశు మందిరాల గురించి ఆసక్తిగా తెలుసుకొని, పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్ ని అందజేశారు.

# వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక




కూకట్‌పల్లిలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో
లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కంటి వైద్య శిబిరం.

---



ప్రాంత ప్రశిక్షణా వర్గలో పాల్గొన్న ఆచార్యులకు యోగ్యతా పత్రాల అంజేత.. కామారెడ్డి ఉన్నత పాఠశాలలో ప్రాంత శైక్షణిక్ ప్రముఖ్ నల్లాన్ కృష్ణమాచార్యులు గారు, సహ శైక్షణిక్ ప్రముఖ్ కుమార్ గారు, విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ పక్కి శ్రీనివాస్ గారి చేతుల మీదుగా వీటిని అందజేశారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

**శ్రీ** విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్, విద్యార్థుల సురక్షిత రవాణా కోసం సురక్షిత డ్రైవింగ్ పద్ధతులు మరియు ట్రాఫిక్ నియమాలను బలోపేతం చేయడానికి, పాఠశాల బస్సు డ్రైవర్లు మరియు అటెండర్లందరి కోసం ఒక రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది.

రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ సి. రాజు, ఇంటెలిజెన్స్ విభాగం నుండి శ్రీమతి పుష్పలత, హెడ్ కానిస్టేబుల్ శ్రీ వేణుగోపాల్ మరియు అతని బృందంతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాచార ప్రదర్శనలు మరియు ఇంటరాక్టివ్ చర్చ ద్వారా, వారు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం, వాహన భద్రతను కాపాడుకోవడం మరియు ప్రయాణ సమయంలో విద్యార్థుల శ్రేయస్సును నిర్ధారించడం యొక్క ప్రాముఖ్యతపై డ్రైవర్లు మరియు అటెండర్లకు అవగాహన కల్పించారు.

విద్యార్థులు మరియు సిబ్బంది ప్రయోజనం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి చొరవ తీసుకున్నందుకు శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి రమావిశ్వనాథన్‌ను శ్రీ సి. రాజు అభినందించారు.

ఈ కార్యక్రమం ఆసక్తికరమైన ప్రశ్నోత్తరాలతో ముగిసింది. ఈ విభాగంలో, పాల్గొన్నవారు తమ సందేహాలను నివృత్తి చేసుకుని, కీలకమైన భద్రతా చర్యలను పునశ్చరణ చేసుకున్నారు.







**ఆ**చార్య ప్రశిక్షణా వర్గ- 2006 లో ఉత్తీర్ణత పొందిన భాగ్యనగర్ విభాగ్ ఆచార్యులకు యోగ్యతా పత్రాలను అందించారు. కార్వాన్ పాఠశాల కేంద్రంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస రావు గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశిక్షణా వర్గ ఉద్దేశం, విద్యాపీఠం ఎందుకు చేస్తుందో వివరించారు.వర్గ ద్వారా జరిగే వికాసాన్ని కూడా వివరించారు.

అలాగే వర్గలో పాల్గొన్న ఆచార్యులు ఈ సందర్భంగా తమ అనుభవాలను పంచుకున్నారు. అలాగే పాఠశాల స్థాయిలో అనువర్తిని కూడా వివరించారు.

# శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు




వి. షణ్ముఖ–4వ తరగతి–కామారెడ్డి




యశ్వంత్ –8వ తరగతి–పాల్వంచ



మరపాక శ్రవణ్‌తేజ–6వ తరగతి–రాంపూర్



జి. హన్విక–3వ తరగతి–సదాశివపేట



యం. అవినాష్–5వ తరగతి–బుధవార్‌పేట



యల్. చరణ్‌కుమార్–4వ తరగతి – ధూల్‌పేట

జి.కె.

# లోక జ్ఞానము - 213



అయాచితుల లక్ష్మణరావు

## జూలై 2026 "స్ఫూర్తి" ఆధారంగా

1. స్వరాజ్యం నా జన్మహక్కు అని నినదించిన భారత యోధుడు ఎవరు?
2. 1930లలో 'గోల్కొండ' పత్రిక సంపాదకులు ఎవరు?
3. వేదవ్యాసుని అసలు పేరేమి?

### ధర్మం - సంస్కృతి

4. వాల్మీకి తండ్రి పేరేమి?
5. త్రిమూర్తులెవరు?
6. రాక్షసుల (దైత్యుల) తల్లి ఎవరు?

### గణిత - వైజ్ఞానిక అంశములు

7. 'పై' విలువ సుమారుగా ఎంత?
8. ఒక వృత్తంలో ఎన్ని డిగ్రీలుంటాయి?
9. అత్యంత తేలికైన వాయువు ఏది?

### సామాజిక శాస్త్రాలు

10. భారతదేశ ప్రామాణిక రేఖాంశం ఏది?
11. మలయ పర్వతాలు విస్తరించి యున్న రాష్ట్రం ఏది?
12. కాశీ విశ్వనాథ మందిర్ ఏ రాష్ట్రంలో ఉంది?

### సమకాలీన అంశాలు

13. ఓటు హక్కుకు సంబంధించి - SIR - అనగానేమి?
14. భారతీయ నేపథ్య గాయని-S.జానకి ఏ రాష్ట్రానికి చెందినవారు?
15. 'హెర్ముజ్' జలసంధి ఏ దేశ నియంత్రణలో ఉంది?

## లోక జ్ఞానము -212 సమాధానములు

1. తిక్కన సోమయాజి
2. ఋగ్వేదం
3. సాందీపని
4. మోక్ష సన్యాస యోగం
5. పరశురాముని
6. రెండవ
7. $180^0$
8. ఆర్యభట్ట
9. మెర్క్యురీ (పాదరసం)
10. రాజస్థాన్
11. నర్మదాకుండం అమరకంటక్
12. మధ్యప్రదేశ్
13. ఎ.రేవంత్ రెడ్డి
14. మీనాక్షీ నటరాజన్
15. తెలంగాణ

## 144 జతపరచుము సమాధానాలు

| | | |
|---|---|---|
| 1 | త. | వి.డి.సతీశన్ |
| 2 | ట. | జోసెఫ్ విజయ్ |
| 3 | ప. | డి.కె.శివకుమార్ |
| 4 | చ. | రేఖాగుప్తా |
| 5 | క. | దేవేంద్ర ఫడ్నవీస్ |

## 145- జతపరచుము

| | | |
|---|---|---|
| 1. మనుచరిత్రము | ( ) | క. బద్దెన |
| 2. వేయిపడగలు | ( ) | చ. బమ్మెర పోతన |
| 3. సుమతీ శతకం | ( ) | ట. ఉన్నవ లక్ష్మీనారాయణ |
| 4. ఆంధ్రమహాభాగవతం | ( ) | త. విశ్వనాథ సత్యనారాయణ |
| 5. మాలపల్లి | ( ) | ప. అల్లసాని పెద్దన |

విద్యార్థులు గానీ,

ఆచార్యులు గానీ మీ సమాధానాలను వ్రాసి స్ఫూర్తి విభాగానికి తపాల / కొరియర్ ద్వారా పంపగలరు.

(లేదా)

sphoortissvp@gmail.com కి మెయిల్ ద్వారా పంపగలరు.

# పిల్లలకు మన ధర్మ గ్రంథాలు అవసరమా!



- లింగం సుధాకర్ రెడ్డి

**సో**షల్ మీడియాలో ఈ మధ్య నేనొక వీడియో క్లిప్పింగ్ చూశాను. ఒక ముస్లింతో హిందూ ఆంకర్ ప్రశ్నిస్తున్న సమయంలో యాంకర్‌ను ముస్లిం "మనం 10 ముస్లిం కుటుంబాలకు వెడదాం, 10 క్రైస్తవ కుటుంబాలకు వెడదాం, అలాగే 10 హిందూ కుటుంబాలకు కూడా వెళ్ళి చూద్దాం, 10 ముస్లిం కుటుంబాల్లో అందరి ఇండ్లల్లో మనకు వారి గ్రంథమైన ఖురాను కనిపిస్తుంది. అందులోని కల్మా చదువుతారు, నమాజు చదువుతారు. 10 మంది క్రైస్తవుల ఇండ్లకు వెళ్లి చూస్తే, ఆ ఇంట్లో ఎంత మంది ఉంటే అన్ని బైబుళ్ళు మనకు కనిపిస్తాయి. అందులో అందరూ బైబులు చేత బుచ్చుకొని చర్చికి వెడతారు. అలాగే 10 మంది హిందువుల ఇండ్లలోకి వెళ్ళి చూద్దాం. ఎన్ని ఇండ్లల్లో మీ రామాయణం, మహాభారతం, భగవద్గీత పుస్తకాలు కనిపిస్తాయి. ఉన్న ఇండ్లల్లోనూ ఎంత మంది వాటిని చదివి ఉంటారు? మిమ్మల్ని నేను రెచ్చగొట్టి అడుగుతున్నాను" అని ప్రశ్నించాడు. ఏమి సమాధానం చెప్పియుంటారు? మనకు ఎంత జ్ఞాన సంపద ఉన్నది! వేదాలు, పురాణాలు, రామాయణం, మహాభారతం, భగవద్గీత-ఇలా ఇంకా ఎన్ని గ్రంథాలు మన వద్ద ఉన్నాయో! వీటికి మనం ఎందుకు దూరంగా ఉన్నాము? ఈ జ్ఞానాన్ని మన పిల్లలకు ఎందుకు అందించలేక పోతున్నాము? వాటిలో ఏమున్నదో మనకు తెలిస్తే కదా, మన పిల్లలకు అందించేది. జీవిత కాలం అధ్యయనం చేసినా తరగని జ్ఞాన సంపద మన వద్ద ఉన్నది. అందులో కొంతైనా మన పిల్లలకు అందించాల్సిన అవసరం లేదా....

మన జ్ఞాన సంపద నుండి మనల్ని దూరం చేయడానికి బ్రిటీషు పాలకులు పెద్ద కుట్ర పన్ని, మనది కాదని తమ (మెకాలే) విద్యా విధానాన్ని మనపై రుద్దారు-



మొదట సంస్కృతాన్ని మృతభాష (Dead Language) అంటూ మన నుండి దూరం చేశారు. మన రామాయణ, మహాభారతాలను-ఇందులోనిదంతా బూటకం (Myth & Mythology) అంటూ మనకు వాటిపై చులకన భావాన్ని కల్గించారు. స్వాతంత్ర్యం వచ్చి 80 స॥లు కావస్తున్నా ఇంకా అదే భావన మనలో పాతుకుపోయి యున్నది.

మెకాలే విద్యా విధానాన్ని మన మీద రుద్ది 2036వ సం॥కి 200 సం॥లు పూర్తి అయ్యే సందర్భంలో అప్పటికి భారతదేశం నుండి దీనిని పెకలించి వేస్తానంటు మన ప్రధానమంత్రి గౌ॥ నరేంద్ర మోది ఈ మధ్య తమ ఉపన్యాసంలో ఉట్టంకించారు. దీనిని సాకారం చేయాల్సింది మనం కాదా?

నేటి ఆధునిక ప్రపంచంలో మన పిల్లలకు మన ధర్మ గ్రంథాల అవసరాన్ని వివరించే విషయంలో కొంత కాలం క్రితం రావుల పాటి వెంకట రామారావు గారి వ్యాసం

చదివి యున్నాను. ఈ సందర్భంగా అందులోని కొన్ని విషయాలను మీ ముందుంచాలనిపించింది.


పూర్వం ఉమ్మడి కుటుంబంలో కనీసం మూడు తరాలవారు ఉండేవారు. ముందు తరం వారి నడవడిక, పద్ధతులను తరువాతి తరం అనుసరించేది. ముఖ్యంగా పిల్లలకు మానవత్వ విలువలు, నైతిక ప్రవర్తన, సంస్కృతి, సంప్రదాయాలను పెద్దలు కథల రూపంలో చెప్పేవారు. రామాయణ భారతాల వంటి పురాణేతిహాసాలను విడమరచి చెప్పడం వల్ల పిల్లల్లో మంచి చెడుల విచక్షణ కలిగేది.

కాలం మారింది. ఇప్పుడు పిల్లలు పాఠ్యపుస్తకాలకు, యువత సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన విషయాలకు పరిమితమవుతున్నారు. పోటీ పరీక్షల అభ్యర్థులు మాత్రమే గ్రంథాలయాలకు వెళ్తున్నారు. అరకొర జ్ఞానంతో, తమకు తోచినట్లు వాణిజ్య విజయాలు కాంక్షించి తీసే చలన చిత్రాలు యువతను పక్కదారి పట్టిస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలల పాఠ్య పుస్తకాల్లో మానవత్వ విలువలకు తగినంత ప్రాధాన్యం ఇవ్వడం లేదని చాలామంది భావిస్తున్నారు. ప్రాచీన భారతదేశ సంస్కృతి, చరిత్ర, పురాణాలు అవసరమా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. అవి అవసరమే. మనిషి వ్యక్తిత్వాన్ని అవి తీర్చిదిద్దుతాయి. ఎలా జీవించాలో, ఎలా బతికితే ఆ పరమాత్మకు నచ్చుతుందో నేర్పుతాయి.

ఆదికావ్యమైన రామాయణంలో కుటుంబ వ్యవస్థ, మానవీయ విలువలను వివరించారు. తండ్రి మాట నిలబెట్టడానికి శ్రీరాముడు వనవాసం చేశాడు. బహుభార్యత్వాన్ని నిరోధించి ఏకపత్నీవ్రతం ఆచరించాడు. జాతి, కుల తారతమ్యం లేకుండా గుహుడు, సుగ్రీవుడు, విభీషణుడు, జటాయువు, హనుమంతుడు, శబరి... తదితరులతో కలిసి జీవించాడు. శత్రువుతో సైతం ఎలా ప్రవర్తించాలో తెలుపుతూ, నైతిక విలువలకు ప్రాధాన్యమివ్వడం రామాయణం గొప్పదనం. స్త్రీలు ఇంటి గడప దాటరాదనే ఆ ంక్షను నిరోధించి సీత రాముడితో వనవాసం చేసింది. అహంకారం, గర్వం, అసూయా ద్వేషాలతో ఎలా పతనం చెందుతారో మహాభారతం వివరించింది. భగవంతుడిపై నమ్మకం భక్తికి నిదర్శనం. అనేక మంది భక్తుల కథలను భాగవతం పేర్కొని మనిషి దైవత్వ గుణాలను సంతరించుకోవాలని బోధించింది. యువతలో నైరాశ్యం తొలిగి ఆత్మవిశ్వాసం పెంపొందించే ఎన్నో కథనాలు పురాణాల్లో ఉన్నాయి. అపజయంతో కుంగిపోకుండా ఓటమిని గెలుపునకు పునాదిగా మలచుకోవచ్చనటానికి పాండవులే నిదర్శనం.

నిరంతర కృషి, దీక్ష, పట్టుదల విజయానికి సోపానాలు. వివేకానంద స్వామి భారత దేశమంతా పర్యటించి యువతకు ధైర్యాన్నిచ్చే సందేశాలు అందించినా ఎవరూ పట్టించుకోలేదు. చివరికి ఆయన సర్వ మత సమ్మేళనంలో చేసిన 'సోదర సోదరీమణులారా' అనే సంబోధన ప్రపంచాన్ని ప్రేమతో కదిలించింది. ఎన్ని అవమానాలు ఎదురైనా సాధన కొనసాగించేవారు తప్పక లక్ష్యాన్ని చేరుకుంటారు. శిశువుకు తొలి గురువు తల్లి. ఆమె మాటలు, పాటలు, ప్రవర్తన బిడ్డ గ్రహిస్తుంది, అనుకరించి నేర్చుకుంటుంది. తండ్రి, గురువు తరువాత స్థానాలు ఆక్రమిస్తారు. అడుగడుగునా సంస్కృతి, సంప్రదాయాలను బోధిస్తే ప్రతి విద్యార్థి సద్గుణ సంపన్నుడైన ఉత్తమ పౌరుడై దేశ భవిష్యత్తుకు బాటలు వేస్తాడు. ధర్మశాస్త్రాలు ఇప్పుడే కాదు, అవి ఎప్పటికీ అనుసరణీయమే! ★

---



**మీరు పరుగెత్తలేక పోతే సరే. మానేయండి. కాని పరుగెత్తుతున్న వారికి కాలు అడ్డుపెట్టకండి. మనం చేయలేని పని మరొకరు చేస్తుంటే మనస్ఫూర్తిగా మెచ్చుకోవాలి కాని వారి ఉత్సాహం మీద నీళ్లు చల్లకూడదు.**

**- బాల గంగాధర తిలక్**

★

# నిశ్శబ్ద ఒత్తిడి (Silent Strain)

– కొత్తపల్లి ఉమ,
ప్రాంత శిశువాటిక ప్రముఖ్, తెలంగాణ



ఆధునిక జీవితం ఎంతో సౌకర్యవంతంగా కనిపిస్తుంది. అయినప్పటికీ చాలా మంది ఒంటరితనం, అలసట లేదా అయోమయం అనుభవిస్తున్నారు. వైద్యులు ఇప్పుడు వీటిని "నిశ్శబ్ద సమస్యలు" అని పిలుస్తున్నారు. ఇవి ఒక్కసారిగా రావు. బిజీ జీవిత విధానాల్లో, ఒత్తిడితో నిండిన మనసుల్లో మెల్లగా పెరుగుతాయి. నిద్ర సరిగా లేకపోవడం, శక్తి తగ్గిపోవడం లేదా ఆందోళన రూపంలో శరీరం హెచ్చరిక సంకేతాలు ఇస్తుంది.

తత్వవేత్త బెర్ట్రాండ్ రస్సెల్ ఆధునిక జీవితం తరచూ "ఎన్నూయి" అనే స్థితిని తీసుకువస్తుందని చెప్పారు అది ఒక మెల్లని, వెలితితో కూడిన బాధ, ఆత్మలో ఏదో లోటు ఉన్న భావన. బయటికి జీవితం సంపూర్ణంగా కనిపించినా లోపల ఏదో అసంతృప్తి ఉంటుంది. ఈ నిశ్శబ్ద అసౌకర్యం నగరాల్లోనే కాదు, చిన్న పట్టణాల్లో, సంతోషకరమైన ఇళ్లలో కూడా అన్ని వయస్సుల వారిని ప్రభావితం చేస్తోంది. ఇది మన కాలంలోని దాగి ఉన్న ఒత్తిడుల్లో ఒకటి.

**లోతైన ఒంటరితనం :–**

ఒంటరితనం కేవలం ఒక భావోద్వేగం మాత్రమే కాదు. అది శరీరాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఒత్తిడి హార్మోన్లు పెరుగుతాయి.



నిద్ర తేలికగా మారుతుంది. రోగనిరోధక శక్తి బలహీనమవుతుంది. శాస్త్రవేత్తలు చెబుతున్నదేమిటంటే, ఒంటరితనం మన పూర్వీకుల ప్రాణరక్షణ కోసం పనిచేసిన అత్యవసర సంకేతాలను మళ్లీ చురుకుగా చేస్తుంది. మెదడు దీర్ఘకాలిక ఒంటరితనాన్ని ప్రమాదంగా భావిస్తుంది. మనుషులు ఎక్కువకాలం ఒంటరిగా ఉండేందుకు రూపుదిద్దుకోలేదు. స్నేహం, నమ్మకం, సంభాషణ, పరస్పర సహకారం ద్వారా మనం ఎదుగుతాము. లోతైన ఏకాంతం మన సహజ స్థితి కాదు. అనుబంధాల్లోనే మన జీవితం వికసిస్తుంది.

**ఉద్యోగ అలసట (Burnou):–**

ఎక్కువకాలం నిరంతరం అధికంగా పనిచేయడం వల్ల "బర్నౌట్" వస్తుంది. ఇది మనసును మందగింపజేస్తుంది; హృదయాన్ని భారంగా చేస్తుంది. విశ్రాంతి తీసుకున్నా విశ్రాంతిలా అనిపించదు. చాలామంది దీనికి తమనే కారణమని భావిస్తారు. కానీ బర్నౌట్ బలహీనత కాదు. అది శరీరం, మనసుకు విరామం అవసరమని తెలిపే సంకేతం.

రస్సెల్ నిరంతర బిజీ జీవితం నిజమైన ఆనందాన్ని దూరం చేస్తుందని చెప్పారు. షేక్ స్పియర్ కూడా అలసిపోయిన మనసుల గురించి రాశారు. ఆయన పాత్రలు ఒత్తిడి, అయోమయం, అలసటతో బాధపడుతూ కనిపిస్తాయి. అధిక ఒత్తిడి మనిషిని దిగులులోకి, అనుమానాల్లోకి, ఒంటరితనంలోకి నెట్టగలదని అవి తెలియజేస్తాయి. ఆధునిక కార్యాలయాలు తరచూ ఒక నిజాన్ని మరిచిపోతాయి – యంత్రాలు నిరంతరం పనిచేయగలవు; మనుషులు కాదు.

**2. శరీరం ఇచ్చే హెచ్చరికలు:–**

ఒత్తిడి శరీరంలో వాపు (inflammation) పెంచుతుంది. గాయాల సమయంలో ఇది ఉపయోగకరమైనదే. కానీ అది ఎక్కువకాలం కొనసాగితే హానికరమవుతుంది. అగ్ని లేకపోయినా మోగుతూనే ఉండే అలారం లాంటిది అవుతుంది. ఇది గుండె ఆరోగ్యం, మానసిక స్థితి, రోగనిరోధక శక్తిని ప్రభావితం చేస్తుంది. తాజా పరిశోధనలు చెబుతున్నదేమిటంటే, ఒంటరితనం రక్తంలోని ప్రోటీన్లను మార్చి దీర్ఘకాలిక వ్యాధులకు దారి తీస్తుంది.

ఒంటరితనం గలవారికి గుండె జబ్బులు, మధుమేహం, జ్ఞాపకశక్తి తగ్గుదల వచ్చే ప్రమాదం ఎక్కువ. సామాజిక బాధను కూడా శరీరం శారీరక నొప్పిలాగానే అనుభవిస్తుంది. రస్సెల్ ప్రకారం పుస్తకాలు, తోటలు, మంచి సంభాషణలు, అర్థవంతమైన నిశ్శబ్దం మనసుకు సమతుల్యత ఇస్తాయి. మనసు, శరీరం ఒకటే. ఒకటి బాధపడితే మరొకటి కూడా ప్రభావితమవుతుంది.

**స్క్రీన్ ఒత్తిడి :-**

ఫోన్లు మనల్ని కలుపుతాయి. కానీ అవి మనసును అలసటకు గురి చేస్తాయి. మనం ఎక్కువగా స్క్రోల్ చేస్తాం; తక్కువగా మాట్లాడుతాం. వినడం బదులుగా "లైక్" చేస్తాం.



అనేక మందిని ఫాలో అవుతాం; కానీ కొద్దిమందినే నిజంగా కలుస్తాం. ఆన్లైన్ జీవితం వేగంగా ఉంటుంది; కానీ చాలాసార్లు చల్లగా, అనుబంధం లేనిదిగా అనిపిస్తుంది. ఎక్కువ సేపు స్క్రీన్ ముందు గడపడం నిద్రను భంగపరుస్తుందని, ఆందోళనను పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. మనసుకు నిజమైన ముఖాలు, నిజమైన స్వరాలు, నిజమైన స్పర్శ అవసరం. షేక్స్పియర్ కూడా ఇలాంటి లోతైన ఒంటరితనాన్ని అర్థం చేసుకున్నారు. ఆయన పాత్రలు జనాల మధ్య ఉన్నప్పటికీ తమను ఎవరూ అర్థం చేసుకోరని భావిస్తాయి. ఈ పాఠం పాతదైనా నిజమే – నిరంతర సంభాషణ నిజమైన అనుబంధానికి సమానం కాదు.

**నగర జీవన భారము :-**

నగరాలు ఉద్యోగాలు, వెలుగులు, ఆహారం, సౌకర్యాలు ఇస్తాయి. కానీ అవి శబ్దం, తొందర, ఒత్తిడిని కూడా తెస్తాయి. మనుషులు దగ్గరగా ఉంటారు; కానీ మనసులు దూరమవుతాయి. పచ్చదనం తగ్గిపోతుంది. ప్రయాణ సమయం పెరుగుతుంది. సామాజిక బంధాలు బలహీనమవుతాయి. ప్రకృతి మనసును ప్రశాంతపరుస్తుంది. కాంక్రీట్ ప్రపంచం మనసును అలసటకు గురి చేస్తుంది. వర్డ్స్ వర్త్ ప్రకృతి హృదయాన్ని నయం చేస్తుందని నమ్మారు. చిన్న పార్కు లేదా సాయంత్రపు నడక కూడా మనసుకు కొత్త శక్తిని ఇస్తుంది. మనుషులకు నిశ్శబ్దంగా ఊపిరి పీల్చుకునే, ప్రశాంతంగా కూర్చునే ప్రదేశాలు అవసరం. ఒక దయగల నగరం శారీరకంగానే కాదు, భావోద్వేగపరంగాను సురక్షితంగా ఉంటుంది.

**3. ఒంటరిగా మిగిలే వృద్ధులు :-**

చాలా మంది వృద్ధులు దీర్ఘకాలిక ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్నారు. కుటుంబ సభ్యులు దూరమవుతారు. స్నేహితులు మరణిస్తారు. ఆరోగ్యం మందగిస్తుంది. ఒంటరితనం వారి రోగనిరోధక శక్తి, జ్ఞాపకశక్తి, మానసిక స్థితిని ప్రభావితం చేస్తుంది. రస్సెల్ ప్రకారం వృద్ధుల వద్ద సమాజం విలువైన జ్ఞానం, అనుభవం, కథలు ఉన్నాయి. ఒక స్నేహపూర్వక సందర్శన, ఓపికగా మాట్లాడటం లేదా కలిసి టీ తాగడం కూడా వారి వారాన్ని ఆనందంగా మార్చగలదు. సమాజపు ప్రేమతో వృద్ధాప్యం గౌరవంగా మారుతుంది. ఎవరూ మరచిపోయినట్టుగా అనిపించకూడదు.

**యువతలో ఆందోళనలు :-**

యువత ఆన్లైన్లో ఎంతో ఆత్మవిశ్వాసంగా కనిపిస్తారు. కానీ లోపల చాలామంది అస్థిరతతో



బాధపడుతున్నారు. వారు తమను ఎడిట్ చేసిన ఫోటోలతో పోల్చుకుంటారు. తాము సరిపోరని భావిస్తారు. చదువుల ఒత్తిడి వారిపై భారమవుతుంది. కుటుంబ ఆశలు మరింత ఒత్తిడిని పెంచుతాయి. వందలాది ఆన్లైన్ "స్నేహితులు" ఉన్నప్పటికీ చాలామంది ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు. పరిశోధనలు యువతలో ఆందోళన, డిప్రెషన్ పెరుగుతున్నాయని చూపిస్తున్నాయి.

రస్సెల్ ప్రకారం ఆసక్తి, నేర్చుకోవాలనే తపన యువ మనసులను బలపరుస్తాయి. వర్డ్స్ వర్త్ ఊహాశక్తి, ప్రకృతి మనసును నిలబెడతాయని భావించారు. యువతకు సున్నితమైన మార్గదర్శకత్వం, ఓపికగా వినడం, వారు ఎదగడానికి సమయం అవసరం.

**సరళమైన స్వస్థత :-**

శుభవార్త ఏమిటంటే, చిన్న చిన్న చర్యలు కూడా ఎంతో సహాయపడతాయి. స్నేహితుడిని కలవడం, ప్రకృతిలో నడవడం, లోతుగా శ్వాస తీసుకోవడం - ఇవన్నీ ఉపశమనాన్ని ఇస్తాయి. మంచి నిద్ర అవసరం. సేవా కార్యక్రమాలు మనసును ఉల్లాసపరుస్తాయి. మనసులోని మాటలను పంచుకోవడం ఉపశమనాన్ని ఇస్తుంది. చిన్న మంచి అలవాట్లు ప్రశాంతతను తిరిగి తీసుకువస్తాయి. స్వస్థత ఒక విత్తనం లాగా మెల్లగా పెరుగుతుంది. శరీరం సురక్షితంగా ఉందని అనిపించినప్పుడు ఒత్తిడి తగ్గడం మొదలవుతుంది. రస్సెల్ ప్రకారం దయ, జ్ఞానం, ప్రేమ, విశ్రాంతి వంటి స్థిరమైన

4. అలవాట్లలోనే నిజమైన ఆనందం పెరుగుతుంది. ఈ చిన్న చర్యలే మనసులో శాంతిని, స్పష్టతను తిరిగి నిర్మిస్తాయి.

**తాజా పరిశోధనలు :-**

తాజా పరిశోధనలు చెబుతున్నదేమిటంటే, ఒంటరితనం పొగ త్రాగడం లేదా చెడు ఆహారం తినడం ఎంత ప్రమాదకరమో అంతే ప్రమాదకరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ఒంటరితనాన్ని ప్రపంచవ్యాప్త ఆరోగ్య సమస్యగా గుర్తించింది. పెద్ద పరిశోధనలు ఒంటరితనం గుండెజబ్బులు, స్ట్రోక్, మధుమేహం, రోగనిరోధక శక్తి బలహీనత, ముందస్తు మరణంతో సంబంధం ఉందని చూపిస్తున్నాయి. యుకేలో జరిగిన కొత్త పరిశోధనలు ఒంటరితనం శరీరంలోని వందలాది రక్త ప్రోటీన్లను మార్చి దీర్ఘకాలిక వ్యాధులకు దారి తీస్తుందని తెలిపాయి.

శాస్త్రవేత్తలు ఇప్పుడు "సామాజిక ఒంటరితనం" మరియు "భావోద్వేగ ఒంటరితనం" అనే రెండు రకాల ఒంటరితనాన్ని అధ్యయనం చేస్తున్నారు. ఇవి శరీరాన్ని వేర్వేరు విధాల ప్రభావితం చేస్తాయి. కానీ రెండూ ఎంతో ముఖ్యమైనవే. ఒంటరితనం అంటే ఒంటరిగా జీవించడం కాదు; ఒంటరిగా అనిపించడం.


*

## రామకృష్ణ కుష్టు ఆశ్రమం

'మేము కేవలం మందు ఇవ్వగలం. కాని నీకు ఈ రోగం నుండి రక్షించేవాడు ఆ యేసు ప్రభువు ఒక్కడే. కాబట్టి ఏసుక్రీస్తును శరణు వేడుకో. రాముడు, కృష్ణుడు ఎవ్వరూ నిన్ను రక్షించలేరు.' కుష్టురోగంతో బాధపడే శ్రీ సదాశివ గోవింద కాతేకు వేతుల్పూర్ (మధ్యప్రదేశ్) లోని మిషన్ ఆసుపత్రిలో చెప్పిన ఈ మాటలు అమితవేదనను కలిగించాయి. ఆయన మనస్సులో ఆలోచనలు చెలరేగాయి. సమాజంలో కుష్టురోగాన్ని గురించి దురభిప్రాయాలు ఎన్నో ప్రచారంలో ఉన్నాయి. వాటి కారణంగానే కుష్టురోగులంటే భయమూ అసహ్యమూ ఏర్పడ్డాయి. ఇట్టి వాతావరణంలో ఆత్మీయులు కూడా దూరంగా పారిపోతున్నారు. రోగికి ధైర్యం చెప్పి సరియైన వైద్యం చేస్తే రోగం నయమవుతుంది. కాని రోగుల నిస్సహాయస్థితిని ఆసరాగా తీసికొని మతం మార్పిడి చేస్తున్నారే, వీరు ఎటువంటి మనుషులు.

ఆయనకు ఒక సంకల్పం కలిగింది, దానితో శ్రీ గురూజీ (మా.స.గోళ్వల్కర్) వద్దకు వచ్చారు. శ్రీ గురూజీ ఆశీస్సులు పొందారు. తమ భవిష్యనిధిని పెట్టుబడిగా చేసుకున్నారు. మధ్యప్రదేశ్లోని చోదర్ అనే చోట రామకృష్ణ కుష్టు ఆశ్రమాన్ని స్థాపించారు మాజీ రైల్వే ఉద్యోగి సదాశివకాతే.

★




పనిచేస్తుంది. దీనికి ప్రఖ్యాత శాస్త్రవేత్త సీవీ రామన్ గౌరవార్థం దీనికి "రామన్ ఇంజిన్" అని పేరు పెట్టారు. ఇది ఉపగ్రహాలను కక్ష్యలో సరైన స్థానంలో చేస్తుంది.

**విక్రమ్-1 ప్రత్యేకతలు ఇవే...**

దేశంలోనే తొలి ప్రైవేట్ రాకెట్ గా ఆర్బిటాల్ విక్రమ్-1 ను అభివృద్ధి చేశారు.

2. స్కైరూట్ అభివృద్ధి చేసిన ప్రొపల్షన్ సిస్టమ్స్, త్రీడీ ప్రింటెండ్ ఇంజన్లు, ఘన ఇంధన రాకెట్ బూస్టర్లను అమర్చారు.

3. సుమారు 350 కిలోల బరువున్న నాలుగు చిన్న ఉపగ్రహాలను 450 కి.మీ.ల ఎత్తులోని భూ నిమ్న కక్ష్యలోకి ప్రవేశపెట్టేలా డిజైన్ చేశారు.

4. ఉక్కు కంటే దృఢంగా, అత్యంత తేలికగా వుండే పూర్తి కార్బన్ కంపోజిట్ మిశ్రమాన్ని దేశంలోనే తొలిసారి ఇందులో వాడారు.

5. విక్రమ్ -1 లోని ఆర్బిటాల్ అడ్జెస్ట్ మెంట్ మాడ్యుల్ పూర్తిగా 3డీ ప్రింటెండ్ లిక్విడ్ ఇంజన్ తో పనిచేస్తుంది. ఇది భారతీయ రాకెట్ లో ఈ ఇంజన్ వాడటం ఇదే ప్రథమం.

6. మొదటి దశ మన దేశంలోనే అతి పొడవైన మోలోలిథిక్ కార్బన్ కాంపోజిట్ రాకెట్ దశ. ఇది స్వదేశీ కాంపోజిట్ తయారీ ఏరో స్పేస్ ఇంజినీరింగ్ లో భారత్ సాధించిన పురోగతికి నిదర్శనం.

7. అంతరిక్ష శిథిలాల తొలగింపు కోసం కాస్మోసర్వ్ సంస్థ రూపొందించిన "ఎంబ్రేస్" అనే రోబోటిక్ ఆర్మ్ సాంకేతికతను తొలిసారి ప్రదర్శించారు.

8. ప్రధాని మోదీ తన స్వహస్తాలతో "వందేమాతరం" అని రాసి, పంపిన ప్రత్యేక పోస్టు కార్డును కూడా ఇది తీసుకెళ్లింది.

9. కాస్మోస్ డైమండ్స్ సంస్థ ప్రయోగశాలలో తయారు చేసిన కాస్మిక్ బ్లూమ్ వజ్రాన్ని ఆరిస్టిక్ పేలోడ్ గా మోసుకెళ్లింది ఈ రాకెట్.

10. ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ (LEO) లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ★



**అశోక్ సింఘాల్ :-** జగన్నాథ రథ యాత్ర శ్రీ అశోక్ సింఘాల్ శిశుమందిర్ రామాయంపేట.. హరే కృష్ణ ...హరే కృష్ణ ... కృష్ణ కృష్ణ హరే... హరే... ★

# సామాజిక, తాత్వికత కలబోతే "యోగి అరవిందులు"



అరవింద జయంతి
ఆగష్టు 15

✍ - అన్నావజ్జల శ్రీనాథరావు

**యో**గి అరవిందులు (శ్రీ అరవింద ఘోష్) భారతదేశంలోని గొప్ప తత్వవేత్తలలో, యోగులలో, కవులలో మరియు స్వాతంత్ర్య సమరయోధులలో ఒకరు. ఆయన భారతీయ ఆధ్యాత్మికతను ఆధునిక ఆలోచనలతో సమన్వయం చేసి ప్రపంచానికి కొత్త దిశను చూపించారు. ఆయన జీవితం దేశభక్తి, జ్ఞానం, యోగసాధన మరియు మానవ వికాసానికి అంకితమైంది.



అరవిందులు 1872 ఆగస్టు 15న కోల్‌కతాలో జన్మించారు. ఆయన తండ్రి కృష్ణధన్ ఘోష్, తల్లి స్వర్ణలతా దేవి. చిన్న వయస్సులోనే ఉన్నత విద్య కోసం ఇంగ్లాండ్‌కు వెళ్లారు. అక్కడ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో చదివి ఆంగ్లం, లాటిన్, గ్రీకు వంటి అనేక భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. అదే యేడాది 250 మంది అభ్యర్థులు ఐసీఎస్ పరీక్ష రాస్తే, మన అరవిందులకు 11 వ స్థానం వచ్చింది. కానీ తరువాత జరిగిన గుర్రపు స్వారీ పోటీలో కావాలనే విఫలమయ్యారు. ఐసీఎస్ దక్కలేదు. నిజానికి గుర్రపు స్వారీ లో పరీక్షకి ఆయన కావాలనే ఆలస్యంగా వెళ్లారు. బహుశ: బ్రిటీష్ అధికారులకి కావాల్సింది కూడా అదే అయి వుండాలి. అరవిందులకు ప్రభుత్వ ఉద్యోగమే నచ్చదు. అందుకే పరీక్షకు ఆలస్యంగా వెళ్లారు. అప్పటికే బరోడా మహారాజా పరిచయం కావడం, ఆయన తన సంస్థానానికి ఆహ్వానించడం జరిగిపోయాయి.

బరోడా సంస్థానంలో చేరిన తర్వాత అరవిందులు సంస్కృతం, బెంగాలీ భాషలను సంపూర్ణంగా ఔపోసన పట్టేశారు. వేదాలు, ఉపనిషత్తులు, గీతతో పాటు రామాయణం, భారతం, భాగవతం వంటి పురాణేతిహాసాలను కూడా అధ్యయనం చేస్తుండేవారు. కొన్ని అనువాదాలనూ, మరికొన్ని స్వంత రచనలను చేసేవారు. బరోడాలో వుండగానే బాల గంగాధర తిలక్, సిస్టర్ నివేదితతో పరిచయం ఏర్పడింది. అతివాదులతో ఘోష్ సాన్నిహిత్యం పెంచుకున్నారు. ఇదంతా అత్యంత రహస్యంగానే జరిగిపోయింది. మొదట రెవిన్యూ శాఖలో పనిచేసినా, తరువాత బరోడా మహారాజా విద్య సంస్థలో అరవిందులు ఫ్రెంచ్ బోధకులుగా చేరారు. ఆ తర్వాత వైస్ ప్రిన్సిపాల్ కూడా అయ్యారు. ఎంతోమంది విద్యార్థులను ప్రభావితం చేశారు.

అలాగే బరోడా సంస్థానంలో వుండగానే అరవిందులు యోగా భ్యాసంలో ఎంతో సాధన చేసేవారు. 1904 నాటికే రోజుకి ఐదారు గంటల ప్రాణాయామం చేసేవారు. ప్రాణాయామం కంటే ముందు ఏదైనా రాయాలంటే అరవిందులకు చాలా సమయం పట్టేదట. కానీ ఎప్పుడైతే ప్రాణాయామ సాధన తీవ్రతరం చేశారో పత్రికా వ్యాసాలు గానీ, సంపాదకీయాలు గానీ, కవితలు గానీ చాలా సులభంగా రాసేవారని చెప్పుకుంటారు. ప్రాణాయామం సాధన ప్రారంభం కాని రోజుల్లో కవిత రాయాలంటే గంట సేపు ప్రయత్నిస్తే 12 పంక్తులకు మించి సాధ్యమయ్యేదే కాదు. కానీ.. ప్రాణాయామ సాధనలో ఉన్నత శిఖరాలకు చేరిన తర్వాత గంటలోనే 200 పంక్తులకు మించి రాసేసేవారట.

స్వాతంత్రోద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. ఎందరో స్వాతంత్రోద్యమంలో పాల్గొనడానికి అత్యంత

నిశ్శబ్దంగా ప్రేరణనిచ్చారు అరవిందులు. విదేశాల్లో విద్యాభ్యాసం పూర్తైన తర్వాత భారత్ కి వచ్చేసి, బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని పెంపొందించారు. భారత దేశానికి "పూర్తి స్వరాజ్యం" కావాలని బలంగా వాదించిన తొలి తరం నాయకుల్లో అరవిందులు కూడా అగ్ర స్థానంలోనే వుంటారు.

ఓ వైపు అధ్యయనం, అధ్యాపనంతో పాటు మాతృదేశ స్వాతంత్ర్యం కోసం రచనలు చేసేవారు. స్వతంత్రం కోసం విప్లవ మార్గాన్ని యెంచుకొని, తమ్ముడు బరీన్ ఘోష్ తో బెంగాల్ తదితర ప్రాంతాలలో రహస్యంగా విప్లవ సంఘాలను స్థాపించారు. అంతేకాక ముంబై నుంచి వెలువడే "ఇందు ప్రకాష్"అనే ఇంగ్లీష్– మరాఠీ వార్తా పత్రికలలో "పాత దివ్వెలకు బదులు కొత్త దీపాలు" అనే శీర్షిక కింద వ్యాసాలు రాసి, అందులో సమకాలీన రాజకీయాల విశ్లేషణలు చేసేవారు. అలాగే దేశభక్తిని కలిపి, దేశ దాస్య శృంఖలాలను ఛేదించడం కోసం ప్రయత్నాలు చేసేవారు. మధ్యలో కొన్ని సార్లు కలకత్తా వెళ్లి, రహస్య విప్లవ సంఘాలకు కర్తవ్య బోధ కూడా చేసేవారు.

1095 లో "వందేమాతరం" ఉద్యమం బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఓ కుదుపు కుదిపింది. ఇందులో రహస్య విప్లవ సంఘాలు నిర్మాణాత్మక పాత్రే పోషించాయి. బిపిన్ చంద్రపాల్ వందేమాతరం పత్రికకు సారథ్యం వహించమని యోగి అరవిందులను కోరారు. అంతేకాక రాజా సుబోధ్ మల్లిక్, జాతీయ కళాశాలను స్థాపించిన తర్వాత, దానికి అరవిందులను ప్రిన్సిపాల్ గా రావాలని కోరారు. దీంతో బరోడా వచ్చి, కాలేజీ ప్రిన్సిపాల్ గా వుంటూ, 'వందేమాతరం" సంపాదకునిగా బాధ్యతలు స్వీకరించారు. పూర్ణ స్వరాజ్య లక్ష్యంగానే పనిచేశారు. అలాగే "కర్మ యోగిన్", "ధర్మ" పత్రికల్లో కూడా పనిచేసి, అందులో రచనలు చేస్తూ జాతీయ భావాలను వ్యాప్తి చేశారు. తన వ్యాసాల ద్వారా బ్రిటీష్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, యువతలో దేశభక్తిని రగిలించారు.

స్వాతంత్రోద్యమం కోసం అరవిందులు ప్రధానంగా సంపూర్ణ స్వరాజ్య భావనను ముందుకు తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషించారు. అలాగే స్వదేశీ ఉద్యమానికి బలమైన మద్దతిచ్చారు. యువతలో జాతీయ చైతన్యాన్ని పెంపొందించడ, పత్రికల ద్వారా దేశభక్తి స్వాతంత్ర భావాలను రగిలించడం చేశారు.

అయితే.. అలీపూర్ బాంబు కేసులో ముద్దాయిగా అరెస్టయ్యారు అరవిందులు. ఓ సంవత్సరం పాటు కారాగార వాస శిక్షను అనుభవించారు. వారికి ఈ జైలు జీవితం ఆశ్రమ జీవితంగా మారింది. తన యోగా సాధన కొనసాగించి, "వాసుదేవ దర్శనం" పొందారు. దేశ స్వాతంత్ర్య ం కోసం, తాను చేసిన కృషి, ప్రాతిపదికగా స్వరాజ్యం సిద్ధిస్తుందనీ, "తన జన్మకు కారణం సనాతన ధర్మ పునరుద్ధరణ అనీ, జైలు నుంచి విడుదల కాగానే, ఆ దిశగా కృషి సాగించమని వాసుదేవుని సందేశం అందుకున్నారు." సరిగ్గా సంవత్సరం పాటు జైలు జీవితం అనుభవించి, అంతరాత్మ సందేశంతో ముందు చంద్రనాగోర్ ఆ తర్వాత 1910 ఏప్రిల్ 4 న పాండిచ్చేరి (పుదుచ్చేరి) చేరుకున్నారు. తన యోగ సాధన కొనసాగించారు.

1914 మార్చి 29 న తొలిసారిగా ఫ్రెంచి విదుషీమణి "మిర్రరా రిచర్డ్" అరవిందులను పాండిచ్చేరిలో కలుసుకున్నారు. తనకు రోజూ కలలో కనిపించి, సూచనలిస్తున్న "కృష్ణుడు" శ్రీ అరవిందులేనని, తన జీవితం వారి సన్నిధిలోనే గడపాలని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత ఆమె "శ్రీమాత" గా సుప్రసిద్ధులయ్యారు. అరవిందులతో కలిసి ఆధ్యాత్మిక రంగంలో విశేష కృషి చేశారు. శ్రీమాతను గురించి అరవిందులు తన మహా కావ్యం "సావిత్రి" లో ఆది పరాశక్తి అని, మహేశ్వరి, మహాకాళి, మహా లక్ష్మీ, మహా సరస్వతీ ఆమెయే అని అరవిందులు వర్ణించారు.

**విద్యపై అరవిందులది తాత్విక దృష్టి కోణం..**

విద్య అంటే కేవలం పరిజ్ఞాన సముపార్జన మాత్రమే కాదని, పరిజ్ఞానం అసలు కొలమానం కాదన్నది అరవిందుల ఆలోచనా ధార. ఆ పరిజ్ఞానాన్ని ఉత్తమమైన రీతిలో వినియోగిస్తున్నామా? లేదా? అన్నదే అంశమని అంటారు.

"ప్రతి శాఖకీ సంబంధించిన కొన్ని విషయాలను మెదడుకు మేపితే దానంతదే వికసిస్తుందనే అపోహలో ఉన్నాం. ఇది నిర్హేతుకం. మానవ అనుభవానికే విరుద్ధం. ఒక జాతిగా ఎన్నో కోల్పోయాం. తీక్షణతను, చురుకుదనాన్ని, సృజనను మాత్రం కాపాడుకుంటూనే వస్తున్నాం. మన విద్యా విధానం వల్ల వీటికి కూడా ముప్పే. అది కూడా పోతే, అంతే సంగతి. మనం మొదటగా చేయాల్సింది మన విద్యాలయాల్లో విప్లవాత్మకమైన మార్పులు తేవడమే"

జాతీయ విద్యా విధానం విషయంపై కూడా స్పష్టమైన దృష్టిని చూపించారు. "జాతీయ విద్యా విధానాన్ని వాంఛించడం అంటే భాస్కరాచార్యుని నాటి గణితాన్ని, ఖగోళ శాస్త్రాన్ని గానీ, నలంద విశ్వవిద్యాలయ పద్ధతులనో నెలకొల్పడం మాత్రమే కాదు. భావమే సజీవం. ఇది ప్రాచీనతకూ, నవ్యతకూ సంబంధమైనది కాదు. అరువు తెచ్చుకున్న సంస్కృతికీ, భారతీయ బుద్ధి ప్రవృత్తుల వికాసానికి సంబంధించింది. వర్తమానానికీ, గతానికి సంబంధించింది కాదు. భారతీయ ఆత్మ. ఆ శక్తి లాంటి తిరోగమనం కాదు. రానున్న శతాబ్దంలోకి ప్రవేశం" అని స్పష్టంగా చెప్పారు అరవిందులు.

**భారత దేశంపై అరవిందుల దృష్టికోణం...**

భారత దేశంపై అరవిందులకు ఓ అపారమైన ప్రేమ వుంది. జాతి అనేది గుప్పెడు మట్టి కాదని, అదో మహాశక్తి అంటారు. జాతిని కోటానుకోట్ల వ్యక్తిగత శక్తుల సమ్మేళనంగా అభివర్ణిస్తారు. కోటాను కోట్ల దేవతలంతా సంఘటితమై, ఏకోన్ముఖమై ఉదయించిన భవానీ, మహిషాసురమర్దని వంటిదే భారతం అని వర్ణిస్తారు. ఇతరులు ఈ దేశాన్ని నిర్జీవ పదార్థంగా చూస్తారు. చెట్లు, చేమలు, నదులనే చూస్తారు. కానీ నాకు ఇది తల్లి అంటారు.

మిగతా దేశాల కంటే భారత్ భిన్నమంటారు. ప్రాచీన భారతం మరణించలేదని అరవిందుల ప్రగాఢ నమ్మకం. సృజనాత్మకతను కూడా కోల్పోలేదంటారు. "ప్రాచీన భారతం మరణించలేదు. సృజనాత్మకత కోల్పోలేదు. ఆమె సజీవంగా వుంది. తనకూ, యావన్మానవాళికీ ఆమె చేయాల్సింది ఇంకా ఉంది. ఇప్పుడు మళ్లీ తల యెత్తడానికి ప్రయత్నించేది పాశ్చాత్య నాగరికతను అనుకరించే ప్రజానీకం కాదు. పాశ్చాత్యులకు విధేయులై, వారి కృతార్థతని, వైఫల్యాన్ని అనుసరించే వారు కాదు. విస్మరింపజాలని అంతశ్శక్తి పునరుద్ధరణ చెందాలి. మళ్లీ తలెత్తి వెలుగునిచ్చే ఆ మూల వంక చూడగలగాలి. తన ధర్మం సంపూర్ణ అర్థాన్ని తెలుసుకోవాలి" అని అరవిందులు ఉద్బోధించారు. ★

## ముందు నాతో మొదలు పెడతాను

స్వర్గీయ ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి పార్లమెంటు భవనం నుండి తిరిగి వచ్చి తమ నివాసంలో ఉన్న తోటలో కూరగాయలు పండిస్తుండేవారు. ఆయన త్రవ్వకం పని, నీటి పని చేసేవారు. వారు ఈ పనులు చేస్తుంటే చూసి నౌకరు పరుగెత్తుకొని వచ్చాడు. వృద్ధుడైన ఆ నౌకరు, 'అయ్యా, ఈ పని తమరు



చేయటం ఎందుకు? ఈ పని మాది. మేము చేస్తాము గదా'. శాస్త్రీజీ ఇలా చెప్పారు, 'పరులకు ఉపదేశం ఇచ్చేవారు చాలా మంది ఉన్నారు. ఒకరికి, చెప్పే ముందు మనం పనిచేసి చూపించాలి. మన మాటలకు, చేతలకు నడుమ తేడా ఉండకూడదు. మనం కష్టించి పని చేస్తే దేశంలోని రైతులు కూడా అలాగే చేస్తారు. వారికి శిక్షణ ఇచ్చేందుకు బోధించేందుకు ఇదే సరియైన మార్గం' నౌకరు ఇది విని తల వంచి శాస్త్రీజీ పని చేస్తుంటే చూస్తూ ఉండిపోయాడు.

★

# సంస్కారవంతమైన సమాజ నిర్మాణంలో సంస్కార కేంద్రాల పాత్ర కీలకం




శ్రీ సరస్వతీ విద్యాపీఠం భాగ్యనగర్ విభాగ్ ఆధ్వర్యంలో సంస్కార కేంద్ర నిర్వాహకుల ఒకరోజు కార్యశాల

భాగ్యనగర్ పరిధిలోని శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సంస్కార కేంద్రాల నిర్వాహకులు, సంయోజకుల ఒకరోజు కార్యశాల కాచీగూడ నింబోలీఅడ్డలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా నిర్వహించబడింది.

కార్యశాలను ఆర్ఎస్ఎస్ నగర సంఘచాలక్ శ్రీ రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ప్రాంత సేవా ప్రముఖ్ శ్రీ జీవీఎల్ శాస్త్రి నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడుతూ, సంస్కార కేంద్రాల ద్వారా సమాజంలో విలువలతో కూడిన తరాన్ని తీర్చిదిద్దే బాధ్యత నిర్వాహకులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమ ప్రస్తావనను విభాగ్ సంయోజక్ శ్రీ మల్లేష్ వివరించారు.




సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి విభాగ్ అధ్యక్షులు పరమానంద్ బన్సల్ అధ్యక్షత వహించగా, కేంద్ర మాజీ మంత్రి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రధాన వక్తగా విచ్చేసిన శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటన కార్యదర్శి శ్రీ పతకమూరి శ్రీనివాసరావు విద్యాపీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ సేవా కార్యక్రమాలను వివరించారు.

ముఖ్య అతిథి శ్రీ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, "సంస్కారాలు తల్లి ఒడి, గుడి, బడి నుంచే లభిస్తాయి. అనాదిగా వస్తున్న ఈ పరంపర కారణంగానే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నేటికీ నిలిచి ఉన్నాయి" అని పేర్కొన్నారు. కేవలం ర్యాంకులు, ఉద్యోగాలకే పరిమితమైన విద్య సమాజానికి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని అందించలేదని, సంస్కారం లేని వ్యక్తి జీవితంలో నిజమైన విజయాన్ని సాధించలేడని అన్నారు. అలాంటి వ్యక్తి సమాజానికి కూడా భారంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం నిర్వహిస్తున్న సంస్కార కేంద్రాలు సమాజంలో చైతన్యాన్ని తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, చిన్నారులను సంస్కారవంతులు, దేశభక్తులు, క్రమశిక్షణ కలిగిన బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. విద్యాపీఠం ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు.

ముగింపు కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు డాక్టర్ సాగి కమలాకర్ శర్మ, సమితి అధ్యక్షులు బి. శంకర్ రావు, కార్యదర్శి శ్రీమతి సుశీల, సభ్యులు డీఆర్ఎస్ నరేంద్ర, ప్రధానాచార్యులు స్రవంతి, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ రాంపల్లి మల్లికార్జున్, విభాగ శైక్షణిక్ సంయోజక్ కాసోజు భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సంస్కార కేంద్రాలకు హాజరయ్యే చిన్నారుల కోసం పాఠశాల బ్యాగులను ప్రముఖుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే సంస్కార కేంద్ర నిర్వాహకులకు ప్రేరణాదాయక పుస్తకాలను అందజేసారు. ★

## వార్తలు



**భిక్కనూర్:–** శ్రీ సరస్వతీ శిశుమందిర్ భిక్కనూర్ పాఠశాలలో గడ్డం మల్లేశం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ హైదరాబాద్ గారు ఫర్నిచర్ ఇప్పించడం జరిగింది. ఫర్నిచర్ ప్రారంభోత్సవం చేయడానికి ముఖ్య అతిథిగా గడ్డం మల్లేశం – సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ హైదరాబాద్ గారు, మద్ది చంద్రకాంత్ రెడ్డి – జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గారు, శ్రీమతి రేఖ సుదర్శన్ – బిక్కనూర్ గ్రామ సర్పంచ్ గారు, తంకరి రాజయ్య గారు – కామారెడ్డి శిశుమందిర్ కమిటీ ఉపాధ్యక్షులు, అతిథులుగా రెడ్డి గారి హరిస్మరన్ రెడ్డి గారు, గిరెడ్డి రాజారెడ్డి గారు, పార్శి కృష్ణమూర్తిగారు, వెంకటేశం గారు, శ్రీనివాస్ గారు రావడం జరిగింది ... ఈ కార్యక్రమంలో ప్రబంధాకారిణి కమిటీ సభ్యులు, సంచాలన సమితి సభ్యులు, సలహా సమితి సభ్యులు, విద్వత్ సమితి సభ్యులు, అలాగే పోషకులు విద్యార్థులు కూడా పాల్గొని పర్నిచర్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ★

---



**అచ్చంపేట:–** పాలమూరు విభాగ్ లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ అచ్చంపేట పాఠశాల పర్యటనలో భాగంగా ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు గారు , జిల్లా అధ్యక్షులు మిడిదొడ్డి శివశంకర్ గారు , పాలమూరు విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ కండె కృష్ణ మోహన్ గారు, పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు మరియు ప్రధానాచార్యులు పాల్గొనడం జరిగింది. పాఠశాలలో జరుగుతున్న విద్యా కార్యక్రమాలు, బోధన విధానం, నూతన ప్రవేశాలు, పాఠశాల నిర్వహణను పరిశీలించి మార్గదర్శనం చేశారు. ★

---



**పాలమూరు :–** శ్రీ సరస్వతీ విద్యాపీఠం పాలమూరు ఉన్నత పాఠశాలలో విభాగ్ స్థాయిలో అభిలేఖగార్ సమావేశం ఘనంగా నిర్వహించారు.



**బెల్లంపల్లి :–** జాతీయ పతాక ఆమోద దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి పాఠశాల విద్యార్థుల ర్యాలీ

★




**శిక్షణకేంద్రము :-** శిక్షణకేంద్రము, శ్రీశారదాధామములో భాగ్యనగర్ విభాగ్‌లోని 2025-26 విద్యా సంవత్సరములో పదవ తరగతిలో ప్రతిభ కనబరచిన 34 మంది విద్యార్థులకు, 54 మంది ఆచార్యులకు, రాష్ట్ర ప్రథమ వచ్చిన చి॥కుల చైతన్యను అభినందించడం జరిగింది. పాల్గొన్న వారు ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు గారు, కార్యదర్శి శ్రీమతి అనఘా వేంకటలక్ష్మీ గారు, ముఖ్య అతిథిగా పాల్గొన్న సుచేత ఫౌండేషన్ శ్రీ సూర్యనారాయణ గారు, విభాగ్ కార్యదర్శి శ్రీ విరివింటి రవీంద్ర శర్మ గారు, మేడ్చల్ అధ్యక్షులు శ్రీ రాజ నర్సయ్య గారు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీ పరమానంద్ బన్సల్ గారు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డా॥ అమరేందర్ గారు, విభాగ్ శైక్షణిక ప్రముఖ్ కాసోజు భూషణ్ గారు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతము చేసినారు.



ఇందులో ప్రాంత సంఘటనా కార్యదర్శి గారు, మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్ కార్యాచరణను ఎన్నుకొని దానికి నిరంతరము కృషి చేస్తుండాలి, అందులో మొదటి విజయంగా పదవ తరగతిలో మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. శిశుమందిరాలలో చదివి నేడు అనేక రంగాలలో ఉన్నత పదవులలో ఉన్నారని, వారు ఎంతో ఆదర్శంగా, నైపుణ్యంతో సేవలు చేస్తున్నారని, వారు మీకు స్ఫూర్తి కావాలని ఆకాక్షించారు. ★

# శ్రద్ధాంజలి




22 జూలై న శ్రీ నరసింహులు గారు పరమపదించారు. జహీరాబాద్ మాధ్యమిక ఆచార్యులుగా, ఉన్నత పాఠశాల ప్రధానాచార్యులుగా బాధ్యతలు నిర్వహించారు. వారికి విద్యాపీఠం పక్షాన శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. వారి ఆత్మకు శాంతి కలగాలని ఈశ్వర ప్రార్థన. ★



**గుజిరిగల్లి-భైంసా:-** శ్రీ సరస్వతీ శిశు మందిరం గుజిరిగల్లి-భైంసా పాఠశాల సహాయాచార్యులు శ్రీమతి.అపర్ణ గారు అనారోగ్య కారణంగా తేది:21.07.2026న పరమపదించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ... శ్రీ సరస్వతీ విద్యాపీఠం & శ్రీ సరస్వతీ శిశుమందిర్ గుజిరిగల్లి - భైంసా పాఠశాల శ్రద్ధాంజలి ఘటించింది. ★

సరస్వతీ నగర్ పాఠశాలలో సహాయ చర్యగా పనిచేయుచున్న శ్రీమతి రూప లావణ్య గారు క్యాన్సర్ తో గత కొన్ని నెలలుగా చికిత్స పొందుతూ జులై 4వ తేదీన స్వర్గస్తులైనారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ పాఠశాల ప్రబంధకారిణి మరియు ఆచార్య బృందము సంతాపం తెలియజేయుచున్నది.



★





శ్రీ సరస్వతీ శిశు మందిరం, వి వి రెడ్డి నగర్ :- పాఠశాల ప్రధానాచార్యులు శ్రీ యస్.మధుసూదన్ పదవీ విరమణ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు శ్రీ జి.యం.వాసుదేవరావు గారు RTPP చీఫ్ ఇంజనీర్, పాఠశాల కోశాధికారి శ్రీ జి.సంతోష్ కుమార్ గారు, RTPP ADE గారు శ్రీ జె.సూర్యనారాయణ పాఠశాల సభ్యులు మరియు పూర్వ విద్యార్థి పరిషత్ అధ్యక్షులు, పాఠశాల సలహా సమితి సభ్యులు, శ్రీ యం. రామాంజ నేయులుగారు, పూర్వ విద్యార్థి పరిషత్ కోశాధికారి శ్రీ బి.గురుశేఖర్ గారు, మరియు ఆచార్యులు, కర్మచారులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.




శ్రీ శారదాధామము ప్రాంగణములోని శ్రీ సరస్వతీ విద్యాపీఠము ప్రాంత కార్యాలయము ప్రారంభించబడింది. సంఘ జ్యేష్ఠ ప్రచారకులు శ్రీ కే.వి.సత్యనారాయణ మార్గదర్శనం చేస్తూ... కేంద్ర కార్యాలయము అన్ని పాఠశాలలకు మూల బిందువని పేర్కొన్నారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠము ప్రాంత సంఘటనా కార్యదర్శి శ్రీ పతకమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ....కార్యాలయము అందరికీ జవాబుదారితనమని పేర్కొన్నారు. ప్రాంత కార్యాలయ పర్యవేక్షకులు శ్రీ పూజారి గోపాలకృష్ణ మాట్లాడుతూ. ఇక నుండి శ్రీ శారదాధామము నుండి పూర్తిగా కార్యాలయ విధులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

RNI No. : 32283
SPHOORTHY (MONTHLY)
Volume : 50 Issue : 08
August - 2026

Postal Reg. No. : D/RNP/HCD-1204/2024-26
Published on 25th of Every Month
Posted on 29th & 30th Every Month
Posting at BPC-IV Partika Channel, Nampally, Hyderabad-01



శిక్షణకేంద్రం:-శిక్షణకేంద్రం-శ్రీశారదాధామం కేంద్రంగా నిర్వహించిన "వర్షారంభ సమావేశాల" సందర్భంగా "బ్రహ్మ విద్యా కుటీర్" వారు తెలుగు రాష్ట్రాల్లోని శ్రీ సరస్వతీ శిశు మందిరాల్లో ఉత్తమ బోధన, ఉత్తమ సేవలందిస్తున్న ఆచార్యులను ఘనంగా సన్మానించారు.



శిక్షణకేంద్రం-శ్రీశారదాధామం:- శ్రీశారదాధామము కేంద్రంగా ప్రాంత వర్షారంభ సమావేశాల సందర్భంగా ప్రాంతంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, ఆయా పాఠశాలల ప్రధానాచార్యులకు విద్యాపీఠం పక్షాన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షులు డా॥ చామర్తి ఉమామహేశ్వరరావు గారు, దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర రెడ్డి గారు, క్షేత్ర కార్యదర్శి అయాచితుల లక్ష్మణ రావు గారు, విద్యాపీఠం ప్రాంత అధ్యక్షులు ఆచార్య తక్కళ్లపల్లి తిరుపతి రావు గారు, ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు గారు, ప్రాంత కార్యదర్శి శ్రీమతి అనఘా వేంకట లక్ష్మీ గారు పాల్గొన్నారు.